http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

గురువారం 9 జనవరి 2025

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

# హరీష్ రావుకు పార్టీ బాధ్యతలు



- ఏసీబీ అరెస్ట్ చేస్తే బయటకు బెయిల్ పై వచ్చేందుకు ఎంత సమయం పడుతుందో కూడా తెలియదు.
- కేటీఆర్ అరెస్ట్ తర్వాత ఎవరి నాయకత్వంలో పార్టీ పనిచేయాలన్న దానిపై కూడా సమాలోచనలు
- అయితే కొందరు ఈ సమావేశంలో కల్వకుంట్ల కవిత పేరు చెప్పారని తెలిసింది
- అయితే కేసీఆర్ ఇందుకు అంగీకరించలేదని అంటున్నారు.

హైదరాబాద్

ఫార్ములా ఈ కారు రేసు కేసులో ఒక స్పష్టత అయితే వచ్చింది. ఈ కేసుకు సంబంధించి కేటీఆర్ అరెస్ట్ ఖాయమని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. ఏసీబీ అరెస్ట్ చేస్తే బయటకు బెయిల్ పై వచ్చేందుకు ఎంత సమయం పడుతుందో కూడా తెలియదు. దీంతో న్యాయనిపుణులతో న్యాయపరమైన అంశాలు మాత్రమే చర్చించిన కేటీఆర్ పార్టీ కార్యక్రమాలను ఎవరు తీసుకెళతారన్న దానిపై కూడా గులాబీ పార్టీ నేతలతో సమావేశమయ్యారు. నందినగర్ లోని కేటీఆర్ నివాసం నుంచే ఎర్రవెల్లి ఫాం హౌస్ లో ఉన్న కేసీఆర్ తో కూడా ఈ విషయాలను చర్చించినట్లు తెలిసింది. కేటీఆర్ అరెస్ట్ తర్వాత ఎవరి నాయకత్వంలో పార్టీ పనిచేయాలన్న దానిపై కూడా సమాలోచనలు జరిపారు. అయితే కొందరు ఈ సమావేశంలో కల్వకుంట్ల కవిత పేరు చెప్పారని తెలిసింది. అయితే కేసీఆర్ ఇందుకు అంగీకరించలేదని అంటున్నారు. కవితకు పార్టీ పగ్గాలు తాత్కాలికంగానైనా అప్పగించేందుకు కేసీఆర్ సుముఖత వ్యక్తం చేయలేదని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. - మిగతా3లో



# ఓ వైపు చలి... మరో వైపు వైరస్

- రోజురోజురోకూ కనిష్ట ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి
- మరోవైపు హెచ్ఎంపీవీ వైరస్ భయపెడుతుంది.
- చలి తీవ్రత పెరగడంతో ప్రజలు వణికిపోతున్నారు
- సాయంత్రం ఐదు గంటల నుంచి ఉదయం పది గంటల వరకూ చలి తీవ్రత అస్సలు తగ్గడం లేదు

హైదరాబాద్

రెండు తెలుగు రాష్ట్రాల్లో చలిగాలుల తీవ్రత తగ్గలేదు. రోజురోజురోకూ కనిష్ట ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి.మరోవైపు హెచ్ఎంపీవీ వైరస్ భయపెడుతుంది. చలికాలంలో వైరస్ వ్యాప్తి చెందుతుందన్న భయంతో ఈ చలి ఎప్పుడు తగ్గుతుందా? అని అందరూ వెయిట్ చేస్తుంటారు. చలి తీవ్రత పెరగడంతో ప్రజలు - మిగతా3లో

## స్పేస్ స్టేషన్ నిర్మాణం కోసం ప్రధాని అనుమతి ఇచ్చారు

- ఇస్రో చాలా విజయవంతమైన దశలో ఉన్నది
- ఎంతో మంది గొప్ప శాస్త్రవేత్తల నాయకత్వంలో సంస్థ కీర్తిగాంచింది
- ఇస్రో చాలా గొప్ప సంస్థ
- గతంలో అనేక మంది గొప్ప నేతలు దీన్ని నడిపించారు
- ఇస్రో చాలా కీలకమైన మిషన్లను చేపడుతున్నది



## మందు బాబులకు షాక్

తెలంగాణకు కింగ్ ఫిషర్ బీర్ల సరఫరా నిలిపివేత

టీజీబీసీఎల్ బీర్ల ప్రాథమిక ధరను 2019 నుంచి ఇప్పటి వరకు సవరించలేదని.


తెలంగాణ ప్రభుత్వం బీర్ల ధరలను పెంచింది కానీ.. తయారీదారులకు చెల్లించే బేస్ ధరను పెంచకపోవడంతో భారీ నష్టాలు వస్తున్నాయి



## హైకోర్టులో కేటీఆర్‌కు చుక్కెదురు

- విచారణ సమయంలో కేటీఆర్‌తో లాయర్ కలిసి కూర్చునే అవకాశం లేదని
- సీసీ టీవీ పర్యవేక్షణ లేదా కేటీఆర్ కనిపించేంత దూరంలో న్యాయవాది ఉండేందుకు హైకోర్టు అనుమతి
- గురువారం ఏసీబీ అధికారుల ఎదుట విచారణకు హాజరుకావాలని కేటీఆర్‌కు హైకోర్టు ఆదేశాలు

# తెలుగు రాష్ట్రాల్లో ఎవరు బెటర్?



ఎన్నికల సమయంలో అన్నిరాజకీయ పార్టీలు అలివి కాని హామీలు ఇస్తాయి. ఆ హామీలను విని ప్రజలు పట్టం కడతారు. తర్వాత అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీల అమలు విషయంలో అధికార పార్టీ గత ప్రభుత్వం పై నెపం నెట్టే ప్రయత్నం చేస్తుంది. అది ఆంధ్రప్రదేశ్ అయినా.. తెలంగాణ అయినా ఒక్కటే. గత ప్రభుత్వాలు చేసినఅప్పుల కారణంగా తాము సంక్షేమ పథకాలను అమలు చేయలేకపోతున్నామని అక్కడ చంద్రబాబు, ఇక్కడ రేవంత్ రెడ్డి పదే పదే చెబుతున్నారు. ప్రజలకు అవన్నీ అనవసరం. ఎన్నికలకు ముందు అప్పుల గురించి ముందే తెలిసినా ఎన్నికల ప్రచారంలో మాత్రం హామీలు ఇచ్చి ఇప్పుడు కోత పెట్టడం పై ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.




## హెచ్ఎంపీవీ వైరస్

- రైల్వేస్టేషన్లు, ఎయిర్‌పోర్టుల స్క్రీనింగ్..!
- కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం
- దేశంలో హెచ్ఎంపీవీ ఇన్ఫెక్షన్ పెరుగుదల నేపథ్యంలో సివిల్ సర్జన్లందరికీ ఒక సలహా జారీ
- హెచ్ఎంపీవీ ముప్పు నేపథ్యంలో ప్రభుత్వాలు నిఘాను పెంచాయి.

# స్పేస్ స్టేషన్ నిర్మాణం కోసం ప్రధాని అనుమతి ఇచ్చారు

**తిరువనంతపురం:** ప్రముఖ రాకెట్ శాస్త్రవేత్త వీ నారాయణన్‌ను ఇస్రో చీఫ్‌గా నియమించిన విషయం తెలిసిందే. ఇస్రో చాలా విజయవంతమైన దశలో ఉన్నదని, చంద్రయాన్-4తో పాటు గగన్‌యాన్ మిషన్లు తమ ముందు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇస్రో చైర్మెన్‌తో పాటు అంతరిక్ష శాఖ కార్యదర్శిగా నియమితుడైన సందర్భంగా వీ నారాయణన్ సంతోషం వ్యక్తం చేశారు. ఎంతో మంది గొప్ప శాస్త్రవేత్తల నాయకత్వంలో సంస్థ కీర్తిగాంచిందని, అలాంటి సంస్థలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇస్రో చాలా గొప్ప సంస్థ అని, గతంలో అనేక మంది గొప్ప నేతలు దీన్ని నడిపించారని, ఈ సంస్థలో భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.
ఓ ప్రశ్నకు బదులిస్తూ.. తన నియామకం గురించి తొలుత ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి ఫోన్ వచ్చినట్లు వీ నారాయణన్ చెప్పారు. ప్రధానియే అన్నీ డిసైడ్ చేస్తున్నారని, పీఎంవో తనను కాంటాక్ట్ అయ్యిందని, ప్రస్తుతం ఇస్రో చైర్మెన్ ఎస్ సోమనాథ్ కూడా తనకు ఫోన్ కాల్ చేశారని, కొత్త అపాయింట్మెంట్ గురించి చెప్పినట్లు ఆయన వెల్లడించారు. త్వరలో చేపట్టబోయే ఇస్రో ప్రాజెక్టుల గురించి మాట్లాడుతూ..



ఇస్రో చాలా కీలకమైన మిషన్లను చేపడుతున్నదని, ప్రస్తుతం ఇస్రో విజయవంతమైన దశలో వెళ్తోందన్నారు. చేపట్టబోయే ప్రాజెక్టుల గురించి వివరిస్తూ.. స్పేడెక్స్ మిషన్‌ను డిసెంబర్ 30వ తేదీన చేపట్టామని, జనవరి 9వ తేదీన స్పేడెక్స్ శాటిలైట్ల డాకింగ్ జరగనున్నట్లు ఆయన తెలిపారు. గగన్‌యాన్ కూడా ఇస్రో ముందున్న అతిపెద్ద ప్రోగ్రామ్ అని పేర్కొన్నారు. క్రూ లేకుండా మాడ్యూల్‌ను ప్రయోగించే దాని కోసం ఇస్రోలో పనులు జరుగుతున్నాయన్నారు. జీఎస్ఎల్వీ ద్వారా ఎన్వీఎస్ 02 నావిగేషన్ శాటిలైట్ను పంపేందుకు శ్రీహరికోటలో వర్క్ జరుగుతోందన్నారు. ఇస్రో మాక్ 3 వెహికిల్ ద్వారా అమెరికాకు చెందిన కమర్షియల్ శాటిలైట్‌ను కూడా ప్రయోగించనున్నారు. గగన్‌యాన్ రాకెట్ అసెంబ్లింగ్‌కు చెందిన పనులు కూడా శ్రీహరికోట్లో ప్రోగ్రెస్ అవుతున్నాయి. చంద్రయాన్3 ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండ్ అయిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. చంద్రయాన్ 4 ద్వారా ఆ ప్రదేశంలో చంద్రుడిపై ల్యాండ్ అయి, శ్యాంపిళ్లు సేకరించిన తర్వాత మళ్లీ తిరిగి వచ్చే రీతిలో పనులు జరుగుతున్నాయన్నారు. భారత స్పేస్ స్టేషన్‌ని సెటప్ చేసేందుకు ప్లాన్ జరుగుతోందన్నారు. స్పేస్ స్టేషన్ నిర్మాణం కోసం ప్రధాని మోదీ అనుమతి కూడా తమకు దక్కిందన్నారు. స్పేస్ స్టేషన్‌కు అయిదు మాడ్యూళ్లు ఉంటాయని, 2028లో స్పేస్ స్టేషన్‌కు తొలి మాడ్యూల్‌ను లాంచ్ చేసే రీతిలో అనుమతి దక్కిందన్నారు.

## హెచ్ఎంపీవీ వైరస్




దేశంలో హెచ్ఎంపీవీ కేసులు పెరుగుతున్నాయి. ఇప్పటి వరకు వైరస్ ఏడుగురికి పాజిటివ్‌గా తేలింది. కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాల వద్ద పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేసింది. దేశంలో హెచ్ఎంపీవీ ఇన్ఫెక్షన్ పెరుగుదల నేపథ్యంలో సివిల్ సర్జన్లందరికీ ఒక సలహా జారీ చేసినట్లు హర్యానా ఆరోగ్య మంత్రి ఆర్టీ సింగ్‌రావు తెలిపారు. హర్యానాలో ఇప్పటివరకు ఒక్క హెచ్ఎంపీవీ కేసు రికార్డవలేదని.. అయితే, ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. హెచ్ఎంపీవీ ముప్పు నేపథ్యంలో ప్రభుత్వాలు నిఘాను పెంచాయి. రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలతో పాటు రద్దీగా ఉండే ప్రాంతాల్లో స్క్రీన్ చేస్తున్నారు. దగ్గు, జలుబుతో ఆసుపత్రులకు వచ్చే రోగులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. వాటిని స్క్రీన్ చేయడంతో పాటు పలు రాష్ట్రాల్లో రోగులను ఉంచేందుకు ఐసోలేషన్ వార్డులను సైతం సిద్ధం చేస్తున్నారు. హ్యూమన్ మెటాప్ న్యూమో వైరస్ శ్వాసకోశ వ్యవస్థలో సమస్యలను కలిగిస్తుంది. రోగనిరోధక వ్యవస్థ బలంగా లేని వ్యక్తులకు ప్రమాదకరం. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తుల్లో ఎక్కువగా వ్యాప్తి చెందేందుకు అవకాశం ఉంది.

# కనిష్టానికి వృద్ధిరేటు

**ముంబై :** భారత ఆర్థిక వ్యవస్థ క్రమంగా బలపడుతోంది.. గతంతో పోలిస్తే ఆర్థిక వృద్ధి గాడిలో పడింది.. కాస్త మందగమనం ఉన్నప్పటికీ.. అనేక విషయాల్లో ముందంజలోనే ఉంది.. ఈ క్రమంలో ఎఫ్ వై25లో భారతదేశ జీడీపీ వృద్ధి 4 సంవత్సరాల కనిష్ట స్థాయి 6.4%కి చేరుకోవచ్చని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. మొదటి ముందస్తు అంచనాల ప్రకారం.. మందగమనం, ఆర్థిక కార్యకలాపాల గురించి హైలైట్ చేస్తుంది.. భారత ఆర్థిక వ్యవస్థ నాలుగేళ్లలో అత్యంత నెమ్మదిగా వృద్ధి చెందగలదని సూచిస్తుంది. నేషనల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ విడుదల చేసిన మొదటి ముందస్తు అంచనాల ప్రకారం.. భారతదేశ ఉఆఖ వృద్ధి ఎఫ్ వై24లో 8.2% నుంచి ఎఫ్ వై25లో 6.4%కి తగ్గుతుందని అంచనా వేసింది..మొదటి ముందస్తు అంచనాల మందగమనం ఆర్థిక కార్యకలాపాల మరింత పతనాన్ని హైలైట్ చేస్తుంది.. ఆర్థిక వ్యవస్థ గత నాలుగు సంవత్సరాలతో పోలిస్తే అత్యంత నెమ్మదిగా వృద్ధి చెందగలదని సూచిస్తుంది."ఎఫ్ వై 2023-24 కోసం జీడీపీ తాత్కాలిక అంచనా లో 8.2% వృద్ధి రేటుతో పోలిస్తే ఎఫ్ వై 2024-25లో వాస్తవ జీడీపీ 6.4% పెరుగుతుందని అంచనా వేసింది.. నామమాత్ర జీడీపీ 9.7% వృద్ధి రేటును సాధించింది. ఎఫ్ వై 2024-25 ఈజలో 9.6% వృద్ధి రేటు కంటే ఎక్కువ 2023-24" అని ఔూ డేటా పేర్కొంది.మార్చి 2025తో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి



ఇటీవలి రిజర్వ్ బ్యాంక్ అంచనా 6.6% కంటే ఈ అంచనా తక్కువగా ఉంది.. ముందస్తు అంచనా, బడ్జెట్ లెక్కల్లో కీలక పాత్ర పోషిస్తుంది.. జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో నమోదైన 5.4% జీడీపీ వృద్ధికి షాక్ ఇచ్చింది. ఈ ఆశ్చర్యకరమైన సంఖ్య ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి దాని వృద్ధి అంచనాను మునుపటి 7.2% నుంచి.. 6.6%కి తగ్గిస్తూ భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రకటన విడుదల చేసింది..స్థిర ధరల వద్ద వాస్తవ జిడిపి ఎఫ్ వై24లో రూ.173.82 లక్షల కోట్ల నుంచి ఎఫ్‌వై25లో రూ.184.88 లక్షల కోట్లకు పెరుగుతుందని అంచనా. ప్రస్తుత ధరల ప్రకారం నామమాత్రపు ఉఆఖ గత ఏడాది రూ.295.36 లక్షల కోట్లతో పోలిస్తే 9.7% వృద్ధి చెంది రూ.324.11 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా.రియల్ గ్రాస్ వాల్యూ యాడెడ్ (ఉఎం) 6.4% వద్ద పెరుగుతుందని అంచనా వేయగా.. ఇది ఎఫ్ వై 24లో 7.2% నుంచి క్షీణత ఉండవచ్చు..మందగమనం ఉన్నప్పటికీ, కీలక రంగాలు ఆశాజనకంగా ఉన్నాయి. వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలు ఎఫ్ వై 24లో 1.4% నుంచి 3.8% పెరుగుతాయని అంచనా వేశారు.. నిర్మాణ రంగం 8.6%, ఆర్థిక, రియల్ ఎస్టేట్, వృత్తిపరమైన సేవలు 7.3% వృద్ధి చెందుతుందని అంచనా వేశారు.గృహ వ్యయానికి కీలక సూచిక అయిన ప్రైవేట్ తుది వినియోగ వ్యయం (ఖఈఅఇ) ఎఫ్ వై 24లో 4.0%తో పోలిస్తే ఎఫ్ వై 25లో 7.3% పెరుగుతుందని అంచనా వేశారు. ఇంతలో, ప్రభుత్వ తుది వినియోగ వ్యయం (ఉఈఅఇ) గత ఆర్థిక సంవత్సరం 2.5% నుంచి 4.1% వృద్ధి రేటుతో పుంజుకోవచ్చని అంచనా వేశారు. వృద్ధి క్షీణించినప్పటికీ, కొన్ని రంగాలు స్థితిస్థాపకంగా ఉండే అవకాశం ఉందని ఈ అంచనాలు పేర్కొంటున్నాయి.. మొత్తం వృద్ధి మందగించినప్పటికీ ఆర్థిక కార్యకలాపాలు కొనసాగుతాయని ఈ డేటా చెబుతోంది.

## 'ఆప్'కు మమత మద్దతు.. కృతజ్ఞతలు చెప్పిన కేజ్రీ



**న్యూఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ కి మమతా బెనర్జీ సారథ్యంలోని టీఎంసీ మద్దతు తెలిపింది. ఇప్పటికే ఆప్‌కు మద్దతిస్తున్నట్టు సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ప్రకటించిన నేపథ్యంలో టీఎంసీ మద్దతు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. దీనిపై సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మమతాబెనర్జీకి కేజ్రీవాల్ కృతజ్ఞతలు తెలిపారు. "ఢిల్లీ ఎన్నికల్లో ఆప్‌కు మద్దతిస్తున్నట్టు టీఎంసీ ప్రకటించింది. మమతా దీదీకి వ్యక్తిగతంగా నా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. థాంక్యూ దీదీ.. మేము బాగున్నప్పుడు, క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడూ కూడా మీరు మా వెన్నంటే ఉండి ఆశీర్వదిస్తున్నారు" అని కేజ్రీవాల్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. ఆయన ట్వీట్‌కు టీఎంసీ ఎంపీ డెరిక్ ఒబ్రెయిన్ వెంటనే 'ఎక్స్'లో స్పందించారు. మేము మీకు బాసటగా ఉంటామంటూ ఆ ట్వీట్‌లో ఒబ్రెయిన్ హామీ ఇచ్చారు. గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో ఆప్ పొత్తుపెట్టుకున్నప్పటికీ ఆ తర్వాత జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఒంటరిగా పోటీ చేసింది. తాజాగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఒంటరిగానే పోటీ చేస్తున్నట్టు ఆప్ మొదట్లోనే ప్రకటించింది. ఢిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగనుండగా, ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడతాయి.

## మహిళల శరీరంపై కామెంట్ చేసినా.. లైంగిక వేధింపే అవుతుంది: కేరళ హైకోర్టు




**కొచ్చి:** మహిళల శరీరం నిర్మాణంపై ఎటువంటి వ్యాఖ్యలు చేసినా.. అది లైంగిక వేధింపు అవుతుందని కేరళ హైకోర్టు పేర్కొన్నది. జస్టిస్ ఏ బదరుద్దీన్ ఈ తీర్పును ఇచ్చారు. కేరళ విద్యుత్తు శాఖకు చెందిన ఓ మహిళా ఉద్యోగినిపై మరో ఉద్యోగి కామెంట్ చేశారు. దీంతో ఆమె లైంగిక వేధింపుల కేసు నమోదు చేసింది. ఆ కేసును కొట్టివేయాలని కోరుతూ ఆ ఉద్యోగి కోర్టును ఆశ్రయించాడు. 2013 నుంచి ఆ ఉద్యోగి చాలా అసభ్యకరమైన భాషను వాడారని, 2017లో అభ్యంతరకరమైన మెసేజ్‌లు, వాయిస్ కాల్స్ చేసేవాడని ఆమె ఆరోపించింది. విద్యుత్తు శాఖకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండాపోయిందన్నారు. మహిళా ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఐపీసీలోని సెక్షన్ 354ఏ(లైంగిక వేధింపులు), 509(మహిళను కించపరచడం), సెక్షన్120(ఓ) కింద కేసు బుక్ చేశారు. కేరళ పోలీసు చట్టంలోని సెక్షన్ 120(ఓ) కింద కూడా ఆ ఉద్యోగి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు కోర్టు పేర్కొన్నది. అయితే కేవలం శరీర శౌష్టవం బాగుందని కామెంట్ చేసినంత మాత్రానా.. తనపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారని, ఆకేసును కొట్టివేయాలని విద్యుత్తు శాఖ ఉద్యోగి కోర్టును ఆశ్రయించారు. కాల్స్, మెసేజ్‌లతో నిందిత వ్యక్తి లైంగిక వేధింపుల కామెంట్స్ చేసినట్లు మహిళా ఉద్యోగి ఆరోపించింది. అయితే ఐపీసీలోని సెక్షన్ 354ఏ, 509తో పాటు సెక్షన్ 120 కేరళ పోలీసు చట్టం ప్రకారం నిందితుడిపై తగిన ఆధారాలు ఉన్నట్లు హైకోర్టు తెలిపింది.


## రూ.25 లక్షల ఆరోగ్య బీమా.. కాంగ్రెస్ మరో స్కీమ్

**న్యూఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీ ప్రకటించడంతో ప్రధాన పార్టీలన్నీ హామీలతో దూసుకు వెళ్తున్నాయి. ప్రధానంగా మహిళలకు ఆర్థిక సహాయం, వృద్ధులకు ఉచిత ఆరోగ్యం స్కీమ్‌లతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ 'జీవన్ రక్షా యోజన' స్కీమ్‌ను బుధవారంనాడు ప్రారంభించింది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని గెలిపిస్తే ఈ పథకం కింద రూ.25 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తామని వాగ్దానం చేసింది. కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ ప్రజలకు ఇచ్చిన రెండో వాగ్దానమిది. జనవరి 6న 'ప్యారీ దీదీ యోజన'ను ఆ పార్టీ ప్రారంభించింది. ఈ పథకం కింద ఢిల్లీలోని మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించింది. తాజాగా రెండో స్కీమ్ను ప్రకటిస్తూ, అధికారంలోకి రాగానే రెండు పథకాలను అమలు చేస్తామని తెలిపింది.




రూ.25 లక్షల ఆరోగ్య బీమా
జీవన్ రక్షా యోజన పథకాన్ని రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ప్రారంభిస్తూ, కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఈ పథకాన్ని చేర్చాలని పార్టీ నిర్ణయించిందని అన్నారు. ఈ పథకం కింద రూ.25 లక్షల వరకూ ఆరోగ్య బీమా కల్పిస్తామని, రాజస్థాన్‌లోనూ ఇదే తరహా పథకాన్ని తాము ప్రారంభించామని చెప్పారు. ఈ పథకం కింద ప్రజలందరికీ రూ.25 లక్షల వరకూ ఉచిత ఆరోగ్య చికిత్స అందిస్తామని, దీనికి ఎలాంటి షరతులు, ఆంక్షలు ఉండవని చెప్పారు. రాజస్థాన్‌లోని 'చిరంజీవి యోజన' తరహాలో రూపొందించిన పథకం ఇదని, రాజస్థాన్‌లో ఆరోగ్య హక్కు చట్టం తెచ్చామని తెలిపారు. ఇదొక విప్లవాత్మక పథకమని అన్నారు. జీవన్ రక్షా యోచన పథకాన్ని ఇక్కడ కూడా ప్రారంభించేందుకు తనను పిలవడం సంతోషంగా ఉందన్నారు. ఢిల్లీలో ఇదొక 'గేమ్ ఛేంజర్' స్కీమ్ అని, ప్రజల వద్దకు ఈ పథకాన్ని అందరూ తీసుకెళ్లాలని కోరారు.
అసెంబ్లీ ఎన్నికలు 2025
ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల తేదీలను జనవరి 7న ఎన్నికల సంఘం ప్రకటించింది. దీంతో తక్షణం ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 5న పోలింగ్, ఫిబ్రవరి 8న కౌంటింగ్ ఉంటుంది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో 70 అసెంబ్లీ స్థానాలకు 62 సీట్లను ఆప్ గెలుచుకోగా, బీజేపీ 8 సీట్లు దక్కించుకుంది. ఆప్‌కు 53.57 శాతం ఓట్లు పోలవ్వగా, బీజేపీ 38.51 శాతం ఓట్లు కైవసం చేసుకుంది.

## రోడ్డు ప్రమాద బాధితులకు ప్రమాద భీమా



రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్యం అందేలా చూడడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం త్వరలోనే కొత్త పథకాన్ని అందుబాటులోకి తీసుకురాబోతోంది. ఈ పథకం కింద రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్యాన్ని పొందవచ్చని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. మార్చి నాటికి దేశవ్యాప్తంగా ఈ పథకం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. రోడ్డు ప్రమాదం జరిగిన 7 రోజుల దాకా రూ.1.5 లక్షల వరకు వైద్యాన్ని పొందే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. అన్ని రకాల రోడ్లపై మోటారు వాహనాల కారణంగా జరిగే ప్రమాదాలకు ఇది వర్తిస్తుందని గడ్కరీ వివరించారు. రోడ్డు ప్రమాదం తర్వాత బాధితులకు అత్యంత కీలకమైన 'గోల్డెన్ అవర్' సమయంలో వైద్య సహాయాన్ని అందించడమే ఈ పథకం లక్ష్యమని గడ్కరీ తెలిపారు. నేషనల్ హెల్త్ అథారిటీ (ఎన్‌హెచ్ఏ) ఈ స్కీమ్‌ను అమలు చేస్తుందని తెలిపారు. పోలీసులు, హాస్పిటల్స్, ప్రభుత్వ వైద్య సంస్థల సహకారం తీసుకోనున్నట్టు గడ్కరీ వెల్లడించారు. రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ, ఈ-డిటైల్డ్ యాక్సిడెంట్ రిపోర్ట్ (ఈఏడీఆర్) అప్లికేషన్, ఎన్‌హెచ్ఏ ట్రాన్సాక్షన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఈ మూడింటితో అనుసంధానించిన ఐటీ ప్లాట్‌ఫామ్ ద్వారా ఈ పథకం కార్యకలాపాలు నిర్వహించనున్నట్టు వివరించారు. ఈ పథకం పైలట్ ప్రాజెక్టు 2024 మార్చి 14న చండీగఢ్‌లో ప్రారంభమైందని, ఆ తర్వాత ఆరు ఇతర రాష్ట్రాలకు విస్తరించామని గడ్కరీ వెల్లడించారు. దేశంలో ఏకంగా 22 లక్షల మంది డ్రైవర్ల కొరత ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.


# ఆ పేరుకు కళంకం తేవడం నాకు ఇష్టం లేదు : తమిళనాడు సీఎం

అన్నా యూనివర్సిటీలో విద్యార్థినిపై లైంగిక దాడి జరిగిన ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అసెంబ్లీ వేదికగా స్పందించారు. ఈ అంశాన్ని అడ్డంపెట్టుకుని కొందరు సభ్యులు మాటిమాటికి అన్నా యూనివర్సిటీ పేరు ప్రస్తావించడాన్ని ఆయన తప్పుపట్టారు. యూనివర్సిటీలో విద్యార్థినిపై జరిగిన దారుణం ఎవరికీ ఆమోదయోగ్యం కాదని, అది దారుణమని వ్యాఖ్యానించారు. 'సభలో చాలామంది సభ్యులు ఒక యూనివర్సిటీ పేరును ప్రస్తావిస్తూ మాట్లాడుతున్నారు. కానీ నేను ఆ యూనివర్సిటీ పేరును ప్రస్తావించదల్చుకోలేదు. నేను ఆ పేరుకు కళంకం తేవాలనుకోవడం లేదు. ఎందుకంటే ఈ సభలో ఉన్నవారిలో చాలామందిని తయారు చేసింది ఆయనే. ఆ భావోద్వేగంతో నేను ఆ పేరును పక్కన పెడుతున్నా. చెన్నైలో విద్యార్థినిపై జరిగిన ఘటనను ఎవరూ ఆమోదించరు. విద్యార్థినిపై లైంగిక దాడి కరమైన చర్య' అని స్టాలిన్ వ్యాఖ్యానించారు. 'సభలోని సభ్యులంతా లైంగిక దాడి ఘటనపై మాట్లాడారు. ఒక్కరు తప్ప మిగతా అందరూ నిజమైన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని చెడుగా చూపించడమే ఆ ఒక్క సభ్యుడి పని. కానీ నేను ఒక్కటే చెబుతున్నా. మా ప్రభుత్వం బాధితురాలికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటుంది. నేరం జరిగిన తర్వాత నిందితుడిని అరెస్ట్ చేయకపోయినా, అతడిని కాపాడే ప్రయత్నాలు జరిగినా ప్రభుత్వాన్ని నిందించవచ్చు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసినా, వేగంగా విచారణ చేయిస్తున్నా ప్రభుత్వాన్ని నిందించడమనేది రాజకీయ ప్రయోజనాల కోసమే' అని స్టాలిన్ ఆరోపించారు.




అన్నా యూనివర్సిటీలో ఇటీవల 19 ఏళ్ల విద్యార్థినిపై గణశేఖరన్ అనే వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు క్యాంపస్ భవనం వెనుకాల తన స్నేహితుడితో మాట్లాడుతుండగా నిందితుడు చూశాడు. ఆమె స్నేహితుడిని బెదిరించి వెళ్లగొట్టి ఆమెపై లైంగిక దాడి చేశాడు. ఘటనపై విద్యార్థిని తన స్నేహితునితో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటికి వచ్చింది. ఈ ఘటన తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది.

# తెలుగు రాష్ట్రాల్లో చర్చ ఎవరు బెటర్?



**హైదరాబాద్ :** ఎన్నికల సమయంలో అన్నిరాజకీయ పార్టీలు అలివి కాని హామీలు ఇస్తాయి. ఆ హామీలను విని ప్రజలు పట్టం కడతారు. తర్వాత అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీల అమలు విషయంలో అధికార పార్టీ గత ప్రభుత్వం పై నెపం నెట్టే ప్రయత్నం చేస్తుంది. అది ఆంధ్రప్రదేశ్ అయినా.. తెలంగాణ అయినా ఒక్కటే. గత ప్రభుత్వాలు చేసినఅప్పుల కారణంగా తాము సంక్షేమ పథకాలను అమలు చేయలేకపోతున్నామని అక్కడ చంద్రబాబు, ఇక్కడ రేవంత్ రెడ్డి పదే పదే చెబుతున్నారు. ప్రజలకు అవన్నీ అనవసరం. ఎన్నికలకు ముందు అప్పుల గురించి ముందే తెలిసినా ఎన్నికల ప్రచారంలో మాత్రం హామీలు ఇచ్చి ఇప్పుడు కోత పెట్టడం పై ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకి వస్తే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి ఇరవై వేల రూపాయల పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పది వేల రూపాయలతో కలిపి తాము పది వేలు కలిపి అన్నదాత సుఖీభవ పథకం కింద త్వరలోనే రైతులకు సాయం అందిస్తామని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వం కూడా అదే మాదిరి నాడు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను కలిపి రాష్ట్ర నిధులను చేర్చిరైతులు సాయం అందచేసింది. ఇప్పుడు చంద్రబాబు కూడా అదే తరహాలో రైతు లకు పెట్టుబడి సాయాన్ని పదివేలు కేంద్రం ఇస్తే పది వేలు ప్రభుత్వం ఇస్తామని ప్రకటించడం ఎంతవరకూ సబబని ప్రశ్నిస్తున్నారు. ఇక్కడే పదివేల రూపాయలు కోత పెట్టారని రైతులు అంటున్నారు.నాడు వైసీపీ ప్రభుత్వం కూడా అప్పట్లో ఆరువేలు కేంద్ర ప్రభుత్వ నిధులు, రాష్ట్ర ప్రభుత్వం మరో ఆరు వేల రూపాయలను కలిపి పన్నెండు వేల రూపాయలను రైతులకు చెల్లించేది. కానీ చంద్రబాబు ఇరవై వేల రూపాయలు సాయం చేస్తామని ప్రకటించడంతో గత ఎన్నికల్లో రైతులందరూ కూటమి ప్రభుత్వం వైపు మొగ్గు చూపారు. దీంతో అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం చంద్రబాబు తమ ప్రభుత్వం నుంచి పదివేల రూపాయలను మాత్రమే రైతులకు ఇవ్వడమేంటన్న ప్రశ్నఎదురవుతుంది. పీఎం కిసాన్ సమ్మాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఒక్కసారిగా పదివేల రూపాయలకు పెంచింది. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం పెంచకపోతే చంద్రబాబు ఇచ్చేవారు కాదా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. అయితే తమది కూటమి ప్రభుత్వం కాబట్టి రెండు పార్టీలూ కూటమిలో ఉన్నాయి కాబట్టి తాము కలసి సాయం అందచేస్తామని అధికార పార్టీ నేతలు చెబుతున్నారు.మరొక వైపు తెలంగాణలో మాత్రం రేవంత్ రెడ్డి రైతులకు పన్నెండు వేల రూపాయలు ప్రకటించారు. కేవలం రైతులకు మాత్రమే కాదు వ్యవసాయకూలీలకు కూడా సాయం అందచేస్తామని ప్రకటించారు. తెలంగాణలో రైతులకు అదనంగా రెండు వేల రూపాయలు అందుతున్నాయి. తెలంగాణలోని రైతులకు కూడా కేంద్ర ప్రభుత్వం పది వేల రూపాయలు ఇస్తుండగా, రేవంత్ రెడ్డి సర్కార్ పన్నెండు వేల రూపాయలు ఇస్తుంది. అంటే ఇక్కడ అదనంగా రెండు వేల రూపాయలు చెల్లిస్తుంది. ఇక్కడ కూడా తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఎన్నికలకు ముందు పదిహేను వేల రూపాయలు రైతు భరోసా ఇస్తామని ప్రకటించింది. అయితే దానిని మూడు వేల రూపాయలు తగ్గించిందన్న విమర్శలు కూడా విపక్షాల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. కానీ ఆంధ్రప్రదేశ్ తో పోల్చుకుంటే తెలంగాణ లో రైతులకు అదనంగా రెండు వేల రూపాయలు రైతు భరోసా నిధులు జమ అవుతుండటంతో ఏపీ కంటే తెలంగాణాయే బెటర్ అన్న కామెంట్స్ సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. అంటే చంద్రబాబు కంటే రేవంత్ రెడ్డి బెటర్ అంటూ కొందరు నెట్టింట కామెంట్స్ పెడుతున్నారు.

# హరీష్ రావుకు పార్టీ బాధ్యతలు

-మొదటిపేజీ తరువాయి

హరీశ్ రావు విషయంలోనూ ఆయన అంత సుముఖంగా లేరని చెబుతున్నారు. కవిత, హరీశ్ రావుల పేర్లు కేటీఆర్ జైలుకు వెళ్లిన తర్వాత పార్టీ కార్యక్రమాలను చేపడితే బాగుంటుందన్న సూచనలను కూడా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తోసిపుచ్చినట్లు చెబుతున్నారు. కేటీఆర్ లేని సమయంలో పార్టీ కార్యక్రమాలను ఎవరు పర్యవేక్షించాలన్న దానిపై తాను నిర్ణయం తీసుకుంటానని కేసీఆర్ నేతలకు చెప్పినట్లు తెలిసింది.కానీ నేతలు చెబుతున్న సమాచారం మేరకు కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగుతారని చెబుతున్నారు. మరొకరికి పార్టీ పగ్గాలు అప్పగించడం కంటే తానే బయటకు వచ్చి పార్టీ కార్యక్రమాలకు పిలుపునివ్వడం మంచిదన్న యోచనలో కేసీఆర్ ఉన్నారని అంటున్నారు. కాంగ్రెస్ ఏడాది పాలన పూర్తి కావడంతో తాను ఇకబయటకు రాక తప్పదని కూడా కేసీఆర్ సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలిసింది. తానే వచ్చి రాష్ట్ర వ్యాప్త పర్యటన చేసి రాష్ట్రంలో వివిధ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలని కేసీఆర్ నిర్ణయించుకున్నట్లు సమాచారం. కేటీఆర్ అరెస్ట్ అయిన వెంటనే ఎర్రవెల్లి ఫాం హౌస్ నుంచి కేసీఆర్ బయటకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారని, రాష్ట్ర వ్యాప్త పర్యటనకు ముందు మీడియా సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ వైఫల్యాలను కూడా ఎండగట్టేందుకు ఆయన రెడీ అవుతున్నట్లు గులాబీ పార్టీ వర్గాలు వెల్లడించాయి.




**రిస్క్ తీసుకుంటున్న కేటీఆర్**

ఫార్ములా ఈ రేసు కేసులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ ను హైకోర్టు కట్టివేసింది. అరెస్టు నుంచి కల్పించిన రక్షణ కూడా ఎత్తి వేసింది. ఉదంయ తీర్పు రాగానే సాయంత్రం అలా కేటీఆర్ కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే ఆయన న్యాయపోరాటం ఆయనకు రిస్క్‌గా మారుతుందని.. ధైర్యంగా నిలబడి విచారణ ఎదుర్కొంటే ప్రజల నుంచి సానుభూతి అయినా వస్తుందన్న అభిప్రాయం రాజకీయవర్గాల్లో ఉంది. ఇప్పుడు సుప్రీంలోనూ ఊరట లభించకపోతే అన్ని న్యాయపరమైన అవకాశాలను కోల్పోవడంతో పాటు కేసులో ఏదో ఉందని అందుకే ఆయనకు రిలీఫ్ దక్కలేదని ప్రజల్లో ప్రచారం జరిగే అవకాశం ఉంది. ఫార్ములా ఈ రేసు కేసులో ఎలాంటి అవినీతి లేదని కేటీఆర్ గట్టిగా వాదిస్తున్నారు. ఇందులో పస లేదని లొట్టపీసు కేసు అని హైకోర్టు క్వాష్ పిటిషన్ కొట్టివేసిన తర్వాత కూడా వ్యాఖ్యానించారు. అందుకే ఆయన న్యాయపోరాటానికి మొగ్గు చూపారు. ఈ క్రమంలో ఆయన సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే సుప్రీంకోర్టు వరకూ వెళ్లడం ఎందుకని తప్పు చేయనప్పుడు ఎందుకు అలా కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని కాంగ్రెస్ ప్రశ్నిస్తోంది. నిజాయితీ పరుడు అయితే నిరూపించుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎద్దేవా చేస్తోంది. అయితే రాజ్యాంగపరమైన అన్ని అవకాశాలను వినియోగించుకునే హక్కు తనకు ఉందని.. అందుకే సుప్రీంకోర్టుకు పోయామని న్యాయపోరాటం చేస్తున్నామని కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. ఏసీబీ లేదా ఈడీ ఎలాంటి దూకుడు చర్యలు తీసుకున్నా కేటీఆర్ కు రాజకీయంగా ప్లస్ అవుతుందనే అంచనాలు ఉన్నాయి. అరెస్టులు చేయడం వల్ల రాజకీయంగా ఆయనకు సానుభూతి వస్తుంది తప్ప దాని వల్ల ఉపయోగం ఏమీ ఉండదని ఇప్పటి వరకూ జరిగిన రాజకీయాలతో ఎవరికైనా అర్థం అవుతుందని కాంగ్రెస్ నేతలూ బహిరంగంగానే చెబుతున్నారు. అదే కక్ష సాధింపులు అనే భావన ప్రజలకు రాకుండా న్యాయపరమైన అన్ని అవకాశాలనూ వినియోగించుకున్న తర్వాత అరెస్టు చేస్తే కేటీఆర్ తప్పు చేసినందునే న్యాయవ్యవస్థ రిలీఫ్ ఇవ్వలేదన్న అభిప్రాయం ప్రజల్లోకి వెళ్తుంది. అప్పుడు అరెస్టు చేసినా రియాక్షన్ రాదని అనుకుంటూ ఉండవచ్చు. అందుకే అరెస్టు చేయకుండా కేటీఆర్ కు అన్ని న్యాయపరమైన అవకాశాలను కల్పిస్తున్నారని భావిస్తున్నారు. పిటిషన్ వేయడానికి ఎలాంటి అభ్యంతరాలు లేవు కానీ రాజకీయంగా ఎలాంటి పరిణామాలు వస్తాయన్నదానిపైనే కేటీఆర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికే ఏసీబీ సుప్రీంకోర్టులో కేవియట్ వేసినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఏసీబీ అధికారులు గ్రీన్ కో తో పాటు సబ్సిడరీ కంపెనీల్లో సోదాలు ప్రారంభించారు. ఈ కేసులో ఏ టుగా ఉన్న ఐఏఎస్ అధికారి అర్వింద్ కు?మార్, ఏ త్రీగా ఉన్న హెచ్ఎండీఏ మాజీ ఉన్నతాధికారి బీఎల్ఎన్ రెడ్డిలకు కూడా ఈడీ నోటీసులు జారీ చేసింది. వారు కూడా విచారణకు హాజరు కాలేదు. తమకు సమయం కావాలని కోరారు. దాంతో వారికీ మరోసారి ఈడీ నోటీసులు జారీ చేసింది. వారిని ప్రశ్నించిన తర్వాతనే కేటీఆర్ ను ప్రశ్నించాలని ఈడీ అనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. విచారణలకు అయితే హాజరవుతారు కానీ.. ఏసీబీ కానీ ఈడీ కానీ సుప్రీంకోర్టులో పిటిషన్ తేలే వరకూ చర్యలు తీసుకోకపోవచ్చన్న వాదన వినిపిస్తోంది.

# హైకోర్టులో కేటీఆర్‌కు చుక్కెదురు

**హైదరాబాద్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురు అయ్యింది. ఫార్ములా-ఈ కార్ రేస్ వ్యవహారంలో కేటీఆర్ వేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై బుధవారం మధ్యాహ్నం విచారణ చేపట్టింది. ఇరువర్గాల వాదనలూ విన్న న్యాయస్థానం సాయంత్రం 4 గంటలకు తీర్పు వెలువరించింది. ఏసీబీ నమోదు చేసిన కేసు విచారణలో తనతోపాటు న్యాయవాది ఉండాలంటూ కేటీఆర్ కోరడాన్ని కోర్టు ఆక్షేపించింది. కేటీఆర్‌తోపాటు లాయర్ ఉండేందుకు హైకోర్టు నిరాకరించింది. విచారణ సమయంలో కేటీఆర్‌తో లాయర్ కలిసి కూర్చునే అవకాశం లేదని తేల్చి చెప్పింది.



కాగా, సీసీ టీవీ పర్యవేక్షణ లేదా కేటీఆర్ కనిపించేంత దూరంలో న్యాయవాది ఉండేందుకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. ఏసీబీ అధికారులు విచారణ చేస్తున్నప్పుడు న్యాయవాది రాంచందర్‌రావు విజిబుల్ డిస్టెన్స్‌లో ఉండేందుకు అంగీకారం తెలిపింది. విచారణ సందర్భంగా విజిబుల్ డిస్టెన్స్ ఉందా? అని న్యాయస్థానం ఏఏజీ రజనీకాంత్ రెడ్డిని ప్రశ్నించగా.. ఉందని ఆయన న్యాయస్థానానికి తెలిపారు. అలాగే విచారణ సమయంలో కేటీఆర్‌ను విండో నుంచి చూసే అవకాశం కూడా ఉందని, న్యాయవాది ఉండేందుకు లైబ్రరీ రూమ్‌లో ఏర్పాట్లు చేసినట్లు కోర్టు దృష్టికి ఏఏజీ తెచ్చారు. దీంతో కేటీఆర్ పక్కన నేరుగా విచారణలో పాల్గొనేందుకు రాంచందర్ రావుకు అనుమతి నిరాకరించింది. రేపు (గురువారం) ఏసీబీ అధికారుల ఎదుట విచారణకు హాజరుకావాలని కేటీఆర్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. విచారణపై అభ్యంతరాలు ఉంటే మళ్లీ కోర్టుకు రావొచ్చని తెలిపింది.

కేటీఆర్ పిటిషన్‌పై హైకోర్టు కీలక వ్యాఖ్యలు

ఫార్ములా ఈ కారు రేసు కేసులో ఏసీబీ విచారణకు న్యాయవాదిని అనుమతించాలంటూ మాజీ మంత్రి కేటీఆర్ వేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో బుధవారం వాదనలు జరిగాయి. కేటీఆర్ తరపున లాయర్ వాదనలు వినిపించారు. ఈ పిటిషన్‌పై తీర్పును సాయంత్రం 4 గంటలకు వెల్లడిస్తామని న్యాయస్థానం తెలిపింది. తీర్పును సాయంత్రానికి వాయిదా వేసింది. విచారణ సందర్భంగా హైకోర్టు పలు కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సమయంలో న్యాయవాది సమక్షంలో విచారణకు అనుమతి ఇవ్వలేదని.. ఆడియో, వీడియో రికార్డు చేయాలని ఆదేశాలు ఇచ్చామన్న విషయాన్ని న్యాయస్థానం ప్రస్తావించింది. ఎంపీ అవినాష్‌రెడ్డి సీబీఐ కేసులో తాము ఇచ్చిన ఆర్డర్ కాపీ చదివారా అని హైకోర్టు ప్రశ్నించింది. న్యాయవాదిని అనుమతించిన పలు సుప్రీం కోర్టు తీర్పులను కేటీఆర్ తరపు న్యాయవాది ప్రస్తావించగా.. న్యాయవాదిని విచారణ సందర్భంలో అనుమతి ఇవ్వని పలు తీర్పులను ఏఏజీ రజనీకాంత్ రెడ్డి ప్రస్తావించారు. ఏసీబీ విచారణ సమయంలో కనిపించేంత దూరంలో న్యాయవాది కనిపించేలా విచారణ గదులు ఉన్నాయా అని ఏఏజీని హైకోర్టు ప్రశ్నించింది. "ఒక రూంలో ఇన్వెస్టిగేషన్.. ఇంకో రూములో అడ్వకేట్ కూర్చుంటే ఏం ప్రాబ్లం.. ఏసీబీలో అలాంటి వసతులు ఉన్నాయా అని ఏఏజీని హైకోర్టు ప్రశ్నించింది. న్యాయవాదికి కేటీఆర్ కనిపించేలా విజిబుల్ డిస్టెన్స్‌కు ఏసీబీలో సౌకర్యం ఉందో లేదో చెప్పాలని ఏఏజీకి హైకోర్టు ఆదేశించింది. దీనిపై సాయంత్రం 4 గంటలకు చెబుతామని కోర్టుకు ఏఏజీ తెలిపింది. విచారణ గదిలోకి నిందితుడితో న్యాయవాదిని కలిసి అనుమతి ఇచ్చే ప్రసక్తే లేదని ధర్మాసనం తేల్చిచెప్పింది. కానీ ఇక్కడ కేటీఆర్ గతంలో మాజీ మంత్రి , ప్రస్తుత ఎమ్మెల్యే కాబట్టి.. న్యాయవాదికి కనిపించేలా విచారణ గదిలో ఏర్పాట్లు ఉన్నాయా అని హైకోర్టు ప్రశ్నించింది. కేటీఆర్‌పై థర్డ్ డిగ్రీ ఉపయోగించరు కదా అని న్యాయస్థానం ప్రశ్నించింది. కేటీఆర్‌పై థర్డ్ డిగ్రీ ఉపయోగించే అవసరం లేనప్పుడు.. ఇన్వెస్ట్‌గేషన్ రూమ్‌లో న్యాయవాది ఉండడం ఎందుకు అని ప్రశ్న వేసింది కోర్టు. ఒక ముగ్గురి న్యాయవాదుల పేర్లు ఇవ్వాలని కేటీఆర్ న్యాయవాదికి చెప్పిన ధర్మాసనం.. వారిలో ఒకరిని విజుబుల్ డిస్టెన్స్ వరకు మాత్రమే అనుమతి ఇస్తామని స్పష్టం చేసింది. అనంతరం తీర్పును ఈరోజు సాయంత్రం 4 గంటలకు హైకోర్టు వాయిదా వేసింది.

## మందు బాబులకు షాక్



మందు బాబులకు షాకింగ్ న్యూస్ ఇది. తెలంగాణకు కింగ్ ఫిషర్ల బీర్ల సరఫరా నిలిపివేస్తున్నట్లు యునైటెడ్ బ్రూవరీస్ కంపెనీ స్పష్టం చేసింది. తెలంగాణ స్టేట్ బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్ బకాయిలు చెల్లించకపోవడంతో.. ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూబీఎల్ ప్రకటించింది. తెలంగాణ ప్రభుత్వం బీర్ల ధరలను పెంచింది కానీ.. తయారీదారులకు చెల్లించే బేస్ ధరను పెంచకపోవడంతో భారీ నష్టాలు వస్తున్నాయని యూబీఎల్ తెలిపింది. బీర్ల సరఫరా నిలిపివేతకు ఇది కూడా ఒక కారణమని కంపెనీ పేర్కొంది. తెలంగాణ నుంచి రూ. 900 కోట్లు రావాల్సి ఉందని పేర్కొంది. ఈ జాప్యం కూడా కంపెనీ నష్టాలకు కారణమైందని తెలిపింది. ఈ విషయాన్ని సెబీకి లేఖ ద్వారా తెలిపింది. సెబీ లిస్టింగ్ రెగ్యులేషన్స్‌లోని రెగ్యులేషన్ 30 ప్రకారం.. తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్‌కి తమ బీర్ సరఫరాను తక్షణమే నిలిపివేస్తున్నట్లు యునైటెడ్ బ్రేవరేస్ లిమిటెడ్ తన లేఖలో పేర్కొంది. టీజీబీసీఎల్ బీర్ల ప్రాథమిక ధరను 2019 నుంచి ఇప్పటి వరకు సవరించలేదని.. దీని కారణంగా రాష్ట్రంలో భారీగా నష్టాలు వస్తున్నాయని పేర్కొంది. అలాగే.. బీర్ల సరఫరాకు సంబంధించి తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ చాలా బకాయి పడిందని.. ఆ బిల్లులు చెల్లించకపోవడంతో కంపెనీ తీవ్రంగా నష్టపోతుందన్నారు. ఈ కారణంగా టీజీబీసీఎల్‌కి బీర్లను సరఫరా చేయడం సాధ్యం కాదని, ఇక నుంచి బీర్ల సరఫరా నిలిపివేస్తున్నట్లు యూబీఎల్ తన లేఖలో స్పష్టం చేసింది. తమ సమస్యలను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని యూబీఎల్ విజ్ఞప్తి చేసింది. కింగ్ ఫిషర్, కింగ్ ఫిషర్ స్ట్రాంగ్, కింగ్ ఫిషర్ అల్ట్రా, కింగ్ ఫిషర్ అల్ట్రా మ్యాక్స్‌తో పాటు ఇతర బ్రాండ్లను నిలిపివేస్తున్నట్లు యూబీఎల్ స్పష్టం చేసింది. నిజానికి తెలంగాణ రాష్ట్రంలో బీర్ల అమ్మకాలను పరిశీలిస్తే కింగ్ ఫిషర్ బ్రాండ్స్ 60 నుంచి 70 శాతం అధికంగా విక్రయం అవుతున్నట్లు తెలిపింది.

## ఓ వైపు చలి... మరో వైపు వైరస్

-మొదటిపేజీ తరువాయి

వణికిపోతున్నారు. సాయంత్రం ఐదు గంటల నుంచి ఉదయం పది గంటల వరకూ చలి తీవ్రత అస్సలు తగ్గడం లేదు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలు బయటకు రావడానికే భయపడుతున్నారు. ఉదయం విధులకు వెళ్లాల్సిన వారు సయితం చలి తీవ్రతకు ఇబ్బంది పడుతున్నారు. గీజర్ల వాడకం పెరిగిపోయింది. కరెంట్ బిల్లు కూడా తడిసి మోపెడవుతుంది. తెలంగాణలో చలి తీవ్రత బాగా పెరిగింది. కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మెదక్ లో అత్యల్పంగా 9.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదయినట్లు వాతావరణ శాఖ అధికారుల తెలిపారు. పటాన్‌చెరులో 11.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఆదిలాబాద్, కుమురం భీం జిల్లాల్లోనూ చలి తీవ్రత ఎక్కువగా ఉంది. చలి మంటలతో చలి నుంచి అనేక మంది కాపాడుకుంటున్నారు. అయితే చలి తీవ్రత కారణంగా అనేక మంది వ్యాధుల బారిన పడుతున్నారు. జలుబు, దగ్గు, జ్వరం వంటి రోగాలతో ఆసుపత్రులకు వస్తున్నారు. ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రులన్నీ ఇటువంటి రోగాలతో వస్తున్న వారితో కిటకిట లాడుతున్నాయని వైద్యనిపుణుల చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ఏజెన్సీ ఏరియాలోనూ చలి తీవ్రత ఎక్కువగా ఉంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో చలి చంపేస్తుంది. ఏపీలోని ఏజెన్సీల్లో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. దీంతో పాటు హెచ్ఎంపీవీ వైరస్ ఈ కాలంలో ఎక్కువగా వ్యాప్తి చెందుతుందని భావించి ప్రజలు భయాందోళనలకు గురి అవుతున్నారు. హైదరాబాద్ వంటి నగరంలో ఉదయం పది గంటల వరకూ వీధులన్నీ నిర్మానుష్యంగాకే కనిపిస్తున్నాయి. చలి దెబ్బకు వ్యాపారాలు కూడా దెబ్బతిన్నాయని చిరు వ్యాపారులు చెబుతున్నారు. చలికి పండ్ల విక్రయాలు కూడా తగ్గాయంటున్నారు. మరో నాలుగు రోజులు చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందని అధికారులు చెబుతున్నా, శివరాత్రి వరకూ చలి ఇలాగే ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు.

## అడ్డగోలుగా ఆక్రమణలు..

## ఉందిగా జాగా...వేసేయ్ పాగా

**ఖమ్మం :** భద్రాద్రి జిల్లాలో రెవెన్యూ వ్యవస్థ గాడి తప్పింది. జిల్లాలోని అన్ని మండలాలు, పట్టణాల్లో ప్రభుత్వ, అసైన్డ్, సీలింగ్ భూములు, చెరువులు, నాలాలు, శిఖం భూముల ఆక్రమించుకుని విచ్చలవిడిగా నిర్మాణాలు జరుగుతున్నా రెవెన్యూశాఖ అధికారులు మొద్దు నిద్ర వీడట్లేదు. జిల్లా కార్యాలయంలోనే అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వచ్చి పోతున్నారంటే ఇక మారుమూల మండలాల పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పాల్సిన అవసరం లేదు.దీంతో ప్రతి ప్రభుత్వ శాఖలోనూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులు పేరుకుపోతున్నాయి. ఖాళీ జాగా కన్పిస్తే పాగా వేసేయ్ అన్నట్లు ఉంది జిల్లాలో పరిస్థితి. ప్రభుత్వ భూముల్లో ఆక్రమ వెంచర్లు, తప్పుడు సర్వే నంబర్లతో సీలింగ్ భూముల ఆక్రమణలు, చెరువులు నాలాలు, శిఖం భూముల పరిస్థితి దారుణంగా తయారైంది. జిల్లాలో పగలురాత్రీ తేడాలేకుండా వాగుల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. కోర్టు ఆదేశాలను సైతం అమలు చేయలేని దుస్థితిలో ప్రభుత్వ శాఖలు పనిచేస్తున్నాయన్న విమర్శలు విన్పిస్తున్నాయి. వెంగళరావు కాలనీ సమీపంలో వందల ఎకరాల ఫారెస్టు భూమిని కేటీపీఎస్ ఉద్యోగులకు అక్రమ మార్గంలో పట్టాలు చేశారని సమాచారం.రెవెన్యూ అధికారుల లెక్కల ప్రకారం పాల్వంచ పట్టణంలోని సర్వే నంబర్ 444లో మొత్తం విస్తీర్ణం 853.39 ఎకరాలుంటే, అందులో 387 .25 ఎకరాలు నిరుపేదలకు అసైన్ చేశారు. 16 ఎకరాలు ఆక్రమార్కుల చేతిలో ఉంది. సర్వేనం 817లో 2,361.37 ఎకరాల్లో 128 .07 ఎకరాలను నిరుపేదలకు పంపిణీచేశారు. 1,790 ఎకరాలు ఫారెస్టు భూమి, 85.14 ఎకరాలు ఆక్రమణలో ఉంది.సర్వే నం 999లోనూ 4,169.29 ఎకరాలకు 863.23 ఎకరాలను అసైన్ చేశారు. 1,153 ఎకరాలు ఫారెస్టు భూమి కాగా 327.38 ఎకరాలు ఆక్రణకు గురైనట్టు రెవెన్యూ అధికారులే నివేదిక ఇవ్వడం గమనార్హం. తాజాగా 444 సర్వే నంబర్ భూమిలో ఎక్కడో శేఖరంబంజర్ వద్ద ఉన్న 431 సర్వే నంబర్ డాక్యుమెంట్స్ చూపి అధికారులను తప్పుదోవ పట్టిస్తూ సుమారు పదెకరాల ప్రభుత్వ భూమిలో ఓ భూబకాసురుడు ఏకంగా వెంచర్ వేస్తున్నా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు.హెచ్‌పీ గ్యాస్ గోదాం, ఆఫీస్‌కు భూమి అవసరం ఉందని గత నాలుగేళ్లుగా అర్జీలు పెడుతున్నా.. వారికి రెవెన్యూ అధికారులు భూమి చూపలేక పోతున్నారు. లొంగిపోయిన భూమి ఇవ్వాలన్నా, నిరుపేదలకు ఇంటిస్థలం కావాలన్నా, ప్రభుత్వ అవసరాలకు భూమి అవసరం ఉన్నా పాల్వంచ పట్టణంలో సెంటు భూమి లేదని అధికారులు చెప్తున్నారు. రియల్ ఎస్టేట్ కు, ఆక్రమ కట్టడాలకు మాత్రం భూమి ఎక్కడి నుంచి వస్తుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.రెవెన్యూ శాఖ మంత్రిగా ఉన్నా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రెవెన్యూ అధికారుల తీరుపై పలుమార్లు హెచ్చరికలు జారీచేసినా వారిలో ఎలాంటి మార్పు రాకపోవడం దారుణం. ఇకనైనా మంత్రి కల్పించుకొని ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన అవసరం ఉందని జిల్లా వాసులు కోరుతున్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించి, అక్రమ నిర్మాణాలు చేసిన వారిపై అప్పటి కలెక్టర్ రజత్‌కుమార్ షైనీ ఉక్కుపాదం మోపారు. స్థానిక కేఎస్ఎం పెట్రోల్ బంకు నుంచి కలెక్టరేట్ వరకు రోడ్డుకు ఆనుకొని ఉన్న భూమి సర్వే నం 444/1 గా గుర్తించి ఎలాంటి నిర్మాణాలు చేయరాదని ఆదేశాలు జారీచేశారు. కానీ, ప్రస్తుతం ఆ భూముల్లో నిర్మాణలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటంలేదు.మరోవైపు నవభారత్ 444 సర్వే నంబర్‌లో సీలింగ్ భూముల్లో తప్పుడు సర్వే నంబర్లతో దొడ్డిదారిన వెంచర్ల వేసి స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నా పట్టించుకొనే నాథుడే లేడు. ఇవి కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో జరుగుతున్న అక్రమాలు.

## సంపాదకీయం

# జారుగుబల్లపై రూపాయి పతనం!

భారత బడా బూర్జువా వర్గం, దానికి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలక ప్రభుత్వాలు సామ్రాజ్యవాదంతో రాజీపడి దేశ సహజ వనరులను కట్టబెట్టటమే కాక, దేశ కరెన్సీ అయిన రూపాయి విలువను కూడా అమెరికా సామ్రాజ్యవాదుల దయకు వదిలి వేశా రు. దాని ఫలితమే రూపాయి విలువ పతనమై నేడు డాలర్‌కి 85.7 రూపాయిలుగా ఉంది. ఇది అమెరికా డాలర్ ఆధిపత్యానికి నిదర్శనం. అధికార మార్పిడి జరిగిన తర్వాత 1947లో ఒక డాలర్‌తో రూపాయి మారకం విలువ 3.50 రూపాయల ఉంది.1948 నుండి 1980 వరకు కొంచెం అటుఇటుగా ఉంది. ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన తర్వాత రూపాయి విలువ పతనం ఎక్కువగా జరిగింది. అధికార మార్పిడి దగ్గర నుంచి 2022 వరకు రూపాయి విలువ 79 సార్లు పడిపోయింది. నేడు రూపాయి విలువ పతనం తారస్థాయికి చేరింది. సామ్రాజ్యవాదం ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదంపై ఎక్కువగా ఆధారపడటం, నూతన ఆర్థిక విధానాల అమలు, ఎగుమతి, దిగుమతుల్లో ఉన్న వ్యత్యాసం, పెద్ద నోట్ల రద్దు, కరోనా సంక్షోభం, ఉక్రెయిన్ -రష్యా యుద్ధం, తాజాగా ముడి చమురు ఉత్పత్తిని తగ్గించాలన్న ఒపెక్ దేశాల నిర్ణయం రూపాయి విలువ పతనానికి కారణంగా ఉంది. ప్రపంచ చమురు వినియోగించే దేశాల్లో 3వ స్థానంలో ఉన్న భారత్‌కు 85% చమురు దిగుమతిగా ఉంది. చమురే కాకుండా ఫార్మా, టెక్నాలజీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ తదితర రంగాలకు అవసరమైన ముడిసరుకులు, వంటనూనెలు, ఆహారధాన్యాలు, పప్పులు, లోహాలను భారతదేశం దిగుమతి చేసుకుంటున్నది. ఈ దిగుమతులకు చెల్లింపులు డాలర్లలోనే జరపాలి. రూపాయి విలువ తగ్గిన ప్రతిసారి దిగుమతుల కోసం చెల్లించాల్సిన మొత్తం పెరుగుతూ ఉంటుంది. రూపాయి విలువ పడిపోవటం వల్ల దిగుమతి అయ్యే అన్ని వస్తువుల ధరలు పెరుగుతాయి. ధరల పెరుగుదల భారం ప్రజలపైనే పడుతుంది. డీజిల్ ధరలు పెరిగితే, రవాణా చార్జీలు పెరిగి ఉప్పు, పప్పు, ఆహార ధాన్యాల ధరలు పెరుగుతాయి. అంతేకాకుండా ప్రయాణ ఖర్చులు, ఆటోచార్జీలు, బట్టలు, పిల్లల స్కూలు ఫీజులు, ఫోన్లు, టివిలు, ల్యాప్ టాపుల, వాహనాల ధరలు పెరుగుతాయి. పేద, మధ్యతరగతి ప్రజలకు భారంగా మారుతుంది. రూపాయి పతనం ఫలితంగా బడ్జెట్ లెక్కలు, అంచనాలు మారిపోతాయి. విదేశాలకు ఎగుమతి చేసే వారికి మాత్రం ఆదాయం పెరుగుతుంది. ప్రపంచ దేశాలపై ఏ దేశ పెత్తనం ఉంటుందో, ఆ దేశ కరెన్సీ ఆధిపత్యం చలాయిస్తుంది. 1947 దాకా ప్రపంచ ఆధిపత్యం బ్రిటన్ చేతుల్లో ఉంది. దాని ఫౌండ్ కరెన్సీ, ఇతర దేశాల కరెన్సీపై ఆధిపత్యం చలాయించింది. బ్రిటన్ బలహీనపడిన తర్వాత అమెరికా ప్రపంచ పోలీసుగా వ్యహరిస్తూ, తన డాలర్ కరెన్సీ ఆధిపత్యాన్ని ఇతర దేశాలపై నెలకొల్పింది. డాలర్ ఆధిపత్యం: చమురును డాలర్లలో చెల్లించాలనే ఒప్పందం కుదరటానికి ముందు అమెరికా కరెన్సీ విలువ ఆ దేశం వద్దనున్న బంగారం నిల్వలతో ముడిపడి ఉంది. 1974 లో సౌదీ అరేబియా తదితర దేశాలు చమురు ఉత్పత్తిని పరిమితం చేయటంతో ప్రపంచ వ్యాప్తంగా చమురు ధరలు పెరిగాయి. దీంతో అమెరికా రంగంలోకి దిగింది. సౌదీ అరేబియా డాలర్లలోనే చమురు అమ్మకాలు జరపాలని, మిగులు ఆదాయాన్ని అమెరికా ప్రభుత్వ బాండ్లలో మదుపు చేయాలని, దానికి బదులుగా సైనిక, ఆర్థిక సహాయం అందిస్తామని ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ద్వారా సౌదీ అరేబియాను తన వ్యూహంలో అమెరికా ఇరికించింది. అప్పటి నుండి చమురు ఉత్పత్తి దేశాల్లో డాలర్లలోనే చమురు విక్రయం కొనసాగింది. ముడి చమురుకు ఉన్న ప్రాధాన్యత రీత్యా ఈ ఒప్పందం తర్వాత డాలరు ప్రాధాన్యత బాగా పెరిగింది. ముడి చమురుకు అన్ని దేశాలు డాలర్లలో చెల్లించాల్సి వచ్చింది. ఫలితంగా ప్రపంచ వాణిజ్యంలో డాలర్ ప్రాచుర్యం పొందింది. అంతర్జాతీయ మార్కెట్లో వస్తువుల అమ్మకాలు, కొనుగోళ్లు డాలర్లలోనే కొనసాగటంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై అమెరికాకు ఆధిపత్యం ఏర్పడింది. డాలర్ గిరాకీ వల్ల ఇతర దేశాల కరెన్సీలతో పోలిస్తే దాని విలువ బాగా పెరిగింది. అందరికీ డాలర్లు అవసరం కాబట్టి, దానినే తన ఆయుధంగా వాడుకునేందుకు అమెరికాకు అవకాశం ఏర్పడింది. ఉక్రెయిన్‌తో యుద్ధం వలన రష్యా మీద ఆర్థిక ఆంక్షలు విధించటం డాలర్ ఆయుధీకరణకు నిదర్శనం. అమెరికాకు ఎదురు తిరిగే దేశాలకు డాలర్లు చిక్కకుండా చేస్తే వాటి ఎగుమతులు, దిగుమతులకు విఘాతం ఏర్పడుతుంది. పెట్టుబడులు ఆగిపోతాయి. డాలర్ మారకంలో ఆయా దేశాల కరెన్సీ విలువ పడిపోయి విదేశీ రుణాలపై అసలు, వడ్డీల చెల్లింపులు మోయలేని భారంగా మారుతుంది. ఆయా దేశాల డాలర్ నిల్వలు సాధారణంగా పశ్చిమ దేశాల బ్యాంకుల్లో భద్రపర్చటం జరుగుతుంది. అందువల్ల అమెరికా తనకు నచ్చిన దేశానికి కావాల్సినంతమేర డాలర్ల ప్రవాహాన్ని పంపనూవచ్చు, నచ్చనప్పుడు ఆ దేశపు బ్యాంకు ఎకౌంట్లను స్తంభింపచేసి డాలర్ల కొరత సృష్టించవచ్చు. ప్రస్తుతం మూడోవంతు ప్రపంచ దేశాలు అమెరికా నుండి ఇటువంటి సమస్యలనే ఎదుర్కొంటున్నాయి. ఇతర దేశాల మెడలు వంచి అవి తన పెత్తనానికి లోబడి ఉండేలా చేయటానికి కూడా డాలర్ పెత్తనం అమెరికాకు తోడ్పడుతుంది. అమెరికాకు ఆయా దేశాలు చేసే ఎగుమతులు కుదించుకుపోతే, ఆ దేశాల దగ్గర ఉన్న డాలర్ నిల్వలు తరిగిపోతాయి. ఫలితంగా ఇబ్బందులు ఎక్కువ అవుతాయి. తమ దేశీయ అవసరాలకు కావలసిన దిగుమతులను అవి డాలర్ ప్రమేయం లేని వ్యాపారం ద్వారా పొందవచ్చు కాని ఇప్పటికే ఆ దేశాలు ఐఎంఎఫ్ లేదా ప్రపంచ బ్యాంకు దగ్గర పొందిన రుణాలు డాలర్లలోనే చెల్లించాల్సిన ఉంది. అప్పుడు డాలర్ల అవసరం ఆ దేశాలకు తప్పదు. ఆ విధంగా ఐఎంఎఫ్ అమెరికా డాలర్ ఆధిపత్యాన్ని మద్దతుగా ఉంది. అంతర్జాతీయ వాణిజ్యం డాలర్లలోనే సాగాలనే నిబంధన లేకపోతే చాలా దేశాలు తమ తమ సరుకులను తక్కిన దేశాలతో తేలికగా మార్చుకోవచ్చు. డాలర్‌పై ఆధారపడటం అనేది తగ్గితే అది అంతర్జాతీయ వాణిజ్యాన్ని సులభం చేస్తుంది. అది అమెరికాకు ఇష్టం ఉండదు. బ్రిక్స్ ఏర్పాటు: వాణిజ్యంలో అమెరికా డాలర్ ఆధిపత్యాన్ని అడ్డుకునేందుకు బ్రెజిల్, రష్యా, చైనా, భారత్, దక్షిణాఫ్రికా దేశాలు బ్రిక్స్ దేశాల కూటమిగా ఏర్పడ్డాయి. ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, యునైటెడ్ ఎమిరేట్ సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకున్నాయి. ఇంకా 30 దేశాలు బ్రిక్స్‌లో చేరాలనే ఆలోచన చేస్తున్నాయి. ఐఎంఎఫ్‌కు ప్రత్యామ్నాయంగా ప్రత్యేక ఆర్థిక వ్యవస్థ దీని ఏర్పాటు లక్ష్యం. అంతర్జాతీయ వాణిజ్యం ఆయా దేశాల కరెన్సీలలోనే జరగాలనే డిమాండ్ ను బ్రిక్స్ ముందుకు తెచ్చింది. బ్రిక్స్ దేశాల జనాభా 310 కోట్లకు పైగా ఉంది. ఇది ప్రపంచ జనాభాలో 41%, ప్రపంచ వ్యవసాయంలో 45% కలిగి ఉన్నాయి. బ్రిక్స్ దేశాలు, తమ ద్వైపాక్షిక సంబంధాల్లో జోక్యం చేసుకోని, సమానత్వంతో కూడిన, పరస్పర ప్రయోజనాల ఆధారంగా నిర్వహించుకుంటాయి. అంతర్జాతీయ బ్యాంకులకు దీటుగా ప్రత్యేక అభివృద్ధి బ్యాంకును నెలకొల్పేందుకు బ్రిక్స్ దేశాలు సన్నద్ధమవుతున్నాయి. వీటి ప్రయోజనాలు వీటికి ఉన్నా, అమెరికా డాలర్ ఆధిపత్యాన్ని అడ్డుకోగలిగితే ప్రపంచ వాణిజ్యంలో మార్పులు సంభవిస్తాయి. డాలర్ ఆధిపత్యాన్ని సహించని రష్యా, చైనాలు డాలర్‌కి ప్రత్యామ్నాయంగా ఆ దేశాల కరెన్సీలోనే చెల్లింపులు జరపాలని నిర్ణయించాయి. బ్రిక్స్ వేదికగా సమర శంఖం పూరించాయి. పెట్రోల్ విక్రయంలో డాలర్‌కు సౌదీ అరేబియా స్వస్తి చెప్పటం బ్రిక్స్‌కి బలం చేకూరుతుంది. ఇక నుంచి డాలర్లతో పాటు చైనా యువాన్, ఐరోపా సమాఖ్య (ఇయు)యూరో, జపానీస్ యెన్ ల లోను చెల్లింపులు స్వీకరిస్తామని చెప్పింది. వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు కలిసి ఉమ్మడి కరెన్సీ వెలువరించే ప్రయత్నంలో ఉన్నాయి. ఆ కరెన్సీ స్వభావం గురించి ఉమ్మడి అభిప్రాయ రావాల్సి ఉంది. డాలర్ ప్రమేయం లేకుండా అంతర్జాతీయ వాణిజ్యం జరగాలన్న అభిప్రాయం వ్యక్తమవుతున్న నేపథ్యంలో, అలా వ్యతిరేకిస్తున్న దేశాలను బెదిరించటానికి ట్రంప్ పూనుకున్నాడు. అమెరికాకు ఆ దేశాలు ఎగుమతి చేసే సరుకులపై 100% సుంకాన్ని విధిస్తామనే బెదిరింపులు చేస్తున్నాడు. ట్రంప్ బెదిరించగానే ప్రపంచంలో మూడవ అతిపెద్ద 'ఆర్థిక' వ్యవస్థగా చెప్పుకుంటున్న భారతదేశం డాలర్ రహిత వాణిజ్యం పట్ల ఆసక్తిలేదని ప్రకటించటం అమెరికా సామ్రాజ్యవాదానికి మోడీ లొంగుబాటును వెల్లడి చేస్తున్నది.

# బడుగుల జీవితాల్లో వెలుగులు నింపిన విద్యాబాంధవి



మానవ హక్కులంటే, సమాజంలోని అన్ని వర్గాల హక్కులని, ముఖ్యంగా బలహీన వర్గాలు, మహిళలు, పిల్లల హక్కులని, వాటి సాధనకు అక్షరమే ఆయుధమని నమ్మిన సమాజ సేవకురాలు, ఆధునిక భారత మొదటి ముస్లిం మహిళా విద్యావేత్త ఫాతిమా షేక్ . సావిత్రీబాయి పూలేతో కలిసి అణగారిన వర్గాల మహిళలు, పిల్లలకు అక్షరజ్ఞానం ప్రసాదించిన విద్యాదాత. ఆధునిక భారత విద్యారంగానికి మార్గదర్శకురాలు. మనువాద, అగ్రవర్ణ భావజాలికులు సంప్రదాయం పేరుతో శూద్రులకు విద్యను నిరాకరించినప్పుడు, దళిత, ఆదివాసీ, మైనారిటీ వర్గాల మహిళలు, పిల్లల విద్యాహక్కు కోసం గళమెత్తిన ధీరవనిత. సావిత్రీబాయి, జ్యోతిరావు పూలేతో కలిసి విద్యాభివృద్ధికి పాటుపడిన త్యాగమయి. జ్యోతిరావ్ పూలే నేతృత్వంలోని సత్యశోధక్ (సత్యాన్వేషణ) ఉద్యమంలో అగ్ర భాగస్వామి. 1848 లో దళితపిల్లలు, మహిళల కోసం మొదటి పాఠశాలను ప్రారంభించడానికి ప్రయత్నించినప్పుడు, 'మత వ్యతిరేక చర్య'గా పేర్కొంటూ జ్యోతిరావు, సావిత్రీబాయి పూలేలను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఇంటినుండేగాక, గ్రామం నుండి కూడా బహిష్కరించినప్పుడు, ఫాతిమా షేక్ , ఆమె సోదరుడు ఉస్మాన్ షేక్ వారికి సహాయం చేసి ఆదుకున్నారు. పూలే దంపతులు ఉస్మాన్ షేక్ ఇంట్లోనే ఉంటూ, అదే ఇంట్లో పాఠశాల నడిపేవారు. పూలే ఆలోచనల నుండి ప్రేరణ పొందిన ఉస్మాన్ తన సోదరిని సావిత్రీబాయితోపాటు, ఉపాధ్యాయురాలిగా శిక్షణ ఇప్పించాడు. సావిత్రీబాయితో పాటు, ఫాతిమా కూడా నాటి అగ్రవర్ణ, ఆధిపత్య వర్గాల నుండి సామాజిక పరంగా అనేక అవమానాలను, కష్టనష్టాలను ఎదుర్కొన్నారు. ఎందుకంటే వారుదుర్మార్గమైన బ్రాహ్మణీయ కుల వ్యవస్థ నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాడుతున్నందున, ఆధిపత్య కులాలకు చెందిన వారు సహించలేక పోయారు. వారిపై రాళ్లురువ్వడం, ఆవు పేడచల్లడంతో పాటు హింసాత్మకంగా వ్యవహరించారు. ముఖ్యంగా బాలికా విద్యను ప్రోత్సహిస్తున్నందుకు మతోన్మాదులు ఆమెను తీవ్రంగా వ్యతిరేకించారు. ఫాతిమా, సావిత్రిబాయి కలిసి పూలే ప్రారంభించిన విద్యా సంస్థలను ముందుండి నడిపారు. విద్యాభివృద్ధి జరగాలంటే విద్యాసంస్థలు సజీవంగా ఉండాలి. వాటిని నిర్మూలించడానికి మనువాదులు విశ్వప్రయత్నాలు చేసినప్పుడు వాటిని కాపాడుకోడానికి ఫాతిమా చేసిన కృషి అనుపమానమైనది. అడుగడుగునా పూలే దంపతులకు అండగా నిలిచి, సత్యశోధక్ ఉద్యమంలో ముఖ్య భూమిక నిర్వహించారు. సావిత్రీబాయి తన భర్తజ్యోతిరావుపూలేకి రాసిన లేఖలలో, ఫాతిమా షేక్ పై సావిత్రి కురిపించిన ప్రేమాభిమానాలు మనకు కనిపిస్తాయి. పూలే దంపతులు నిర్వహించే కార్యక్రమాలకు ఫాతిమా షేక్ అందించిన సహాయ సహకారాలు అనుపమానమైనవి. ఫాతిమా నాకు ఎంతగానో సహకరించింది. ఆమె సహకారంతోనే నేను ఇన్ని సేవా కార్యక్రమాలను కొనసాగించగలిగాను. అని రాశారు సావిత్రి. సుదీర్ఘ పోరాటం తర్వాత సావిత్రీబాయి ఈనాడు తగిన గుర్తింపును పొందగలిగినా, ఫాతిమా షేక్ ఇంకా విస్మృత విద్యావేత్తగానే మిగిలిపోయారు. దేశ చరిత్ర నుండి విస్మరించబడి, తగిన గుర్తింపు లేని వారి జాబితాలోనే ఉండిపోయారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బడుగు, బలహీన వర్గాల మహిళల హక్కులకోసం పోరాడిన అతికొద్ది మందిలో ఆమె ప్రథమురాలు. దళిత, మైనారిటీ వర్గాలకు చెందిన మహిళలు, పిల్లలకు విద్య నేర్పించాలని ఆమె ఎంతగానో తపన పడ్డారు. ముస్లిం మైనారిటీలు అనుసరించే ఇస్లాం ధర్మం స్త్రీ విద్యను వ్యతిరేకించనప్పటికీ, ఇస్లాం తెలియని ముస్లింల నుండి, అగ్రకుల హిందువులనుండి ఆమె తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. ఆధిపత్య భావజాలం కల సమాజంలో ఫాతిమా షేక్ ఒక ముస్లిం మహిళగా అనేక ఆటుపోట్లు, అవమానాలు చవిచూశారు. అయినా సరే, అకుంఠిత దీక్షతో ఆమె దళితులు, ఆదివాసీలు, స్త్రీలు, పిల్లల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసి, ఆధునిక భారతదేశంలోని మొదటి ముస్లిం మహిళా విద్యావేత్తగా చరిత్రలో నిలిచి పోయారు. 2014లో, మహారాష్ట్ర ప్రభుత్వం ఫాతిమా షేక్ సేవలలను గుర్తించి, సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ , జాకీర్ హుసేన్, అబ్దుల్ కలామ్ లతోపాటు ఫాతిమా షేక్ సంక్షిప్త పరిచయాన్ని తమ రాష్ట్ర పాఠ్యపుస్తకాలలో పొందుపరిచింది. 2021లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంకూడా ఎనిమిదవ తరగతి టెక్ట్స్ బుక్ లో ఫాతిమా షేక్ పై పాఠాన్ని ప్రవేశపెట్టి ఆమె సేవలకు తగిన గుర్తింపును కలిగించింది. అక్షరాన్ని అమితంగా ప్రేమించి, అణగారిన వర్గాలను, ముఖ్యంగా మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి, అహర్నిశలూ అలుపెరుగని పోరు సలిపిన ఫాతిమా షేక్ విస్మృత చరిత్రను వెలికి తీసి భావితరాలకు అందించవలసిన చారిత్రక అవసరం నేటితరం మేధావులపై ఎంతైనాఉంది. ఆదిశగా గట్టి ప్రయత్నం చేస్తున్న ప్రముఖ చరిత్రకారుడు నశీర్ అహ్మద్ కు అభినందనలు.

# తెలంగాణ తొలి ఉద్యమ పూర్వాపరాలు



తెలంగాణ ప్రజలకు అన్ని రంగాలలో జరుగుతున్న అన్యాయానికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు మాత్రమే పరిష్కారమని, రాష్ట్ర సాధనకై పోరాటం తప్పదనే భావన తెలంగాణ యువతలో అంకురించింది. అలా తెలంగాణ తొలి ఉద్యమం తెలంగాణా హక్కుల పరిరక్షణ ఉద్యమంగా మొదలైంది. తెలంగాణా రక్షణలను అమలు చెయ్యాలని కోరుతూ 1969, జనవరి 9 న ఖమ్మం పట్టణంలో బి.ఎ. స్టూడెంట్, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ నాయకుడైన రవీంద్రనాథ్ గాంధీచౌక్ దగ్గర నిరవధిక దీక్ష ప్రారంభించాడు. తొలి దశ ఉద్యమ ప్రారంభ పూర్వా పరాలు తెలుసుకునే ప్రయత్నం ఇది. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలు కలిసి ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటు కావడంలో కీలకమైనది పెద్దమనుషుల ఒప్పందం. 1956లో తెలుగు మాట్లాడే ప్రాంతాలన్నీ ఏకమై ఒకే రాష్ట్రంగా ఏర్పడటానికి రాయలసీమ, తెలంగాణ ఆంధ్ర ప్రాంతాల నాయకులతో కలిసి.1956, ఫిబ్రవరి 20 న ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇదే పెద్దమనుషుల ఒప్పందం. న్యూ ఢిల్లీలో పెద్దమనుషుల ఒప్పందంపై సంతకాలు చేసిన వారు తెలంగాణ తరపున, బూర్గుల రామ కృష్ణారావు, కె.వి.రంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి, జె.వి. నరసింగరావుబీ ఆంధ్ర తరపున నీలం సంజీవరెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి, అల్లూరి సత్యనారాయణ రాజు, గౌతు లచ్చన్న ఉన్నారు. తెలంగాణ అభివృద్ధికి, తెలంగాణ సమానత్వ పరిరక్షణకు సంబంధించిన నిబంధనలు ఏర్పరచు కున్నారు. ఈ ఒప్పందాన్ననుసరించి 1956, నవంబర్ 1 న ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. ఆంధ్ర ప్రాంతానికి చెందిన నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే, ఈ ఒప్పందం అమలు విషయమై కొద్దికాలంలోనే తెలంగాణా ప్రజల్లో అసంతృప్తి తగిలింది. ఒప్పందాన్ననుసరించి ఉప ముఖ్యమంత్రి పదవిని తెలంగాణా వాసికి ఇవ్వలేదుబీ అసలు ఆ పదవినే సృష్టించలేదు. అయితే 1959లో దామోదరం సంజీవయ్య ముఖ్యమంత్రి కాగానే ఉప ముఖ్యమంత్రిగా తెలంగాణ ప్రాంతానికి చెందిన కొండా వెంకట రంగారెడ్డి (కె.వి.రంగారెడ్డి) ని నియమించాడు. అయితే మళ్ళీ 1962 నుండి 1969 వరకు ఉపముఖ్యమంత్రి పదవి లేదు. 1969లో తెలంగాణ ప్రాంతానికి చెందిన జె.వి.నర్సింగరావును ఉప ముఖ్యమంత్రిగా నియమించారు. ఈ విధంగా రాజకీయ పదవుల విషయంలో తమకు అన్యాయం జరిగిందని తెలంగాణ వారు భావించారు. అలాగే ఆంధ్ర ప్రాంతం నుండి తరలి వచ్చిన ప్రజలు తెలంగాణ ప్రాంతంలో భూములు కొని, వ్యవసాయం చేసారు. ఇది తమ భూముల ఆక్రమణగా కొందరు తెలంగాణా ప్రజలు భావించారు. ప్రభుత్వ ఉద్యోగాలు, ఉపాధ్యాయుల నియామకాల్లో తమకు అన్యాయం జరిగిందనే భావన కూడా తెలంగాణా ప్రజల్లో బలంగా కలిగింది. తెలంగాణ విద్యాసంస్థల్లో కూడా తమకు తగినన్ని సీట్లు రాలేదని విద్యార్థుల్లో అసంతృప్తి నెలకొని ఉంది. ఈ నేపథ్యం లోనే "తెలంగాణ తొలి ఉద్యమం"... "తెలంగాణ హక్కుల పరిరక్షణ ఉద్యమం"గా మొదలైంది. తెలంగాణ రక్షణలను అమలు చెయ్యాలని కోరుతూ 1969, జనవరి 9 న ఖమ్మం పట్టణంలో బి.ఎ. స్టూడెంట్, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ నాయకుడైన రవీంద్రనాథ్ గాంధీ చౌక్ వద్ద నిరవధిక దీక్ష ప్రారంభించాడు. ఆరోజు జరిగిన ఊరేగింపులో హింసాత్మక ఘటనలు జరిగాయి. మరుసటి రోజు ఉద్యమం నిజామాబాదుకు పాకింది. జనవరి 10 న హైదరాబాదులోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన విద్యార్థుల సమావేశంలో – తెలంగాణా రక్షణల అమలుకై జనవరి 15 నుండి సమ్మె చెయ్యాలని ప్రతిపాదించారు. అయితే, జనవరి 13 న అదే విశ్వవిద్యాలయంలో జరిగిన ఒక సమావేశంలో విద్యార్థులలోని ఒక వర్గం "తెలంగాణ విద్యార్థుల కార్యాచరణ సమితి"గా ఏర్పడి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే తమ ధ్యేయంగా ప్రకటించారు. జనవరి 13న ఉస్మానియా యూనివర్సిటీలో "తెలంగాణ విద్యార్థుల కార్యాచరణ సమితి" ఏర్పడింది. ఆ రోజు మొట్టమొదటి సారిగా ప్రత్యేక తెంగాణ సాధనను తమ లక్ష్యంగా విద్యార్థులు ప్రకటించుకున్నారు. విద్యార్థుల కార్యాచరణ సమితి మెడికల్ విద్యార్థి మల్లిఖార్జున్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది. విద్యార్థులు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధం కావాని మల్లిఖార్జున్ పిలుపునిచ్చారు. అదే రోజున పురప్రముఖులు కొందరు "తెలంగాణా పరిరక్షణల కమిటీ"ని ఏర్పాటు చేసారు. జనవరి 18 న విద్యార్థుల్లోని రెండు వర్గాలు (తెలంగాణ రక్షణల కోసం ఉద్యమించిన వారు, ప్రత్యేక తెలంగాణ కోరేవారు) వేరువేరుగా హైదరాబాదులో ఊరేగింపులు జరిపారు. ఈ రెండు ఊరేగింపులు ఆబిడ్స్ లో ఎదురైనపుడు ఘర్షణ చెలరేగింది. పోలీసులు లాఠీఛార్జి చెయ్యవలసి వచ్చింది. అదేరోజు శాసనసభలోని ప్రతిపక్ష పార్టీలు తెలంగాణా రక్షణల అమలు కొరకు ప్రభుత్వాన్ని వత్తిడి చేసాయి. ఉద్యమ కారుల కోరికలను చర్చించడానికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం జనవరి 19 న అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఆ సమావేశం ఒక ఒప్పందానికి వచ్చింది. తెలంగాణలో పనిచేస్తున్న ఆంధ్ర ఉద్యోగులను వెనక్కి పంపించాలి. పెద్దమనుషుల ఒప్పందం లోని తెలంగాణ రక్షణలను అమలు చెయ్యాలి. అయితే ప్రత్యేక తెలంగాణ వాదులు ఈ ఒప్పందానికి సమ్మతించలేదు. ప్రత్యేక రాష్ట్రమే తమ ధ్యేయమని, అది నెరవేరే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని ప్రకటించారు. జనవరి 24న సదాశివపేటలో కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో 14 మంది గాయపడ్డారు. గాయపడ్డ వారిలో 17 ఏళ్ల శంకర్ మరుసటి రోజు గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. 1969 తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు శంకర్. కాల్పులకు నిరసనగా కొండా లక్ష్మణ్ బాపూజీ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ప్రత్యేక తెలంగాణ కాంగ్రెస్ సమితిని ఏర్పాటు చేశారు. అఖిలపక్ష కమిటీ ఒప్పందాన్ని అమలు చేస్తూ జనవరి 22న ప్రభుత్వం ఒక ప్రభుత్వ ఉత్తర్వును జారీ చేసింది. దీని ప్రకారం ఫిబ్రవరి 28 కల్లా స్థానికులు కాని ఉద్యోగులని వారి వారి స్థానాలకు వెనక్కి పంపివేస్తారు. తెలంగాణ రక్షణల అమలుకై మిగులు నిధుల అంచనాకు ఢిల్లీనుండి ఒక బృందం వస్తుంది. ఈ హామీలతో ఉద్యమానికి ఆద్యుడైన ఖమ్మం విద్యార్థి రవీంద్ర నాథ్ తన దీక్షను విరమించాడు. దీనితో తెలంగాణ రక్షణల అమలు ఉద్యమం ఆగిపోయింది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం రెండవ దశలోకి ప్రవేశించింది. జనవరి 28న వరంగల్లులో కాళోజీ నారాయణరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్యమంత్రి రాజీనామా చెయ్యాలని, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని తీర్మానం చేసారు. 1969 ఫిబ్రవరి 28 న యువకులు, మేధావి వర్గాలు కలిసి హైదరాబాదులో తెలంగాణ ప్రజాసమితి ని స్థాపించారు. జూన్ 4న తెలంగాణ పరిస్థితి తీవ్రతను తెలుసుకున్న ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ హైదరాబాద్ నగరానికి వచ్చి విద్యార్థి నాయకులు, తెలంగాణ ప్రజా సమితి నాయకులతో చర్చలు జరిపింది. తెలంగాణ తొలి ఉద్యమ కాలంలో మొత్తం 95 సార్లు కాల్పులు జరిగాయి. హైదరాబాద్, వరంగల్ నగరాల్లో కర్ఫ్యూ విధించారు. ఉద్యమంలో 369 మంది చనిపోగా, ప్రభుత్వ లెక్కలు మాత్రం 57 మంది చనిపోయినట్టుగా చెప్పాయి. తెలంగాణ ప్రజా సమితి నేతతో కేంద్రం చర్చలు జరిపింది. సెప్టెంబర్‌లో చెన్నారెడ్డి ఢిల్లీలో చర్చలు జరిపి వచ్చిన తర్వాత విద్యార్థులు తరగతులకు హాజరు కావాలని చెన్నారెడ్డి, విద్యార్థి నాయకుడు మల్లికార్జున్ ఒక ప్రకటన చేశారు. చదువులు కొనసాగిస్తూనే ఉద్యమంలో పాల్గొనాని విజ్ఞప్తి చేశారు. ఈ విధంగా ఉద్యోగులను, విద్యార్థును ఉద్యమం నుంచి పక్కకు తప్పించారు. మర్రి చెన్నారెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రజాసమితి 1971 లో పార్లమెంటుకు జరిగిన మధ్యంతర ఎన్నికలలో 10 సీట్లు సాధించడం, ఆ ఎన్నికల్లో ఇందిరా గాంధీకి సంపూర్ణ ఆధిక్యత రావడంతో తెలంగాణా ప్రజాసమితి మద్దతు కీలకం కాకపోవడం,1971 సెప్టెంబర్ 24 న బ్రహ్మానంద రెడ్డి రాజీనామా చేసాక కొద్దిరోజులకు చెన్నారెడ్డి తెలంగాణా ప్రజా సమితిని రద్దు చేయడం, ఆ పార్టీని జాతీయ కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయడం క్రమానుగతంగా జరిగి పోయాయి. అలా తొలి దశ ఉద్యమం నీరు గారి పోవడం తెలిసిందే... 2001 ఏప్రిల్ 27న కేసిఆర్ నేతృత్వంలోని తెరాస ఉద్యమ పార్టీ ఏర్పాటు కావడం, సుదీర్ఘ మలి ఉద్యమ పోరాటాల, అత్మ బలిదానాల ఫలితంగా, భారత ప్రభుత్వం 2 జూన్ 2014 న తెలంగాణ నిర్మాణ దినంగా ప్రకటించడం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరగడం అందరికీ తెలిసిందే.

# రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించాలి

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష





**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, జనవరి-08:** సుల్తానాబాద్ పట్టణంలో అంబేద్కర్ విగ్రహం నుంచి గట్టెపల్లి వెళ్లే రోడ్డు విస్తరణ పనులు త్వరగా ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సుల్తానాబాద్ పట్టణంలో రోడ్డు విస్తరణ పనుల పై సంబంధిత అకారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహం నుంచి గట్టెపల్లి వరకు రోడ్డు విస్తరణ పనుల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆసుపత్రి, ఆర్%డ%బీ శాఖకు సంబంధించిన షెటర్ల కు సంబంధించి వారికి సమాచారం అందించి వెంటనే తొలగించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రత్యామ్నాయం చూపించిన తర్వాత కళాశాల షటర్లు సైతం తొలగించాలని అన్నారు. పట్టణంలో జంక్షన్ అభివృద్ధి చర్యలు చేపట్టాలని అన్నారు. అంబేద్కర్ విగ్రహం వద్ద కూలిపోయే స్థితిలో ఉన్న పాఠశాలను తొలగించాలని, సుల్తానాబాద్ పట్టణంలో నూతనంగా పాఠశాల, జూనియర్ కళాశాల నిర్మాణానికి అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఈ ఈ భావ్ సింగ్ ,మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉచితంగా ఇసుక సంఫరా

**...... జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**

**. పెద్దపెల్లి జిల్లా రిజిస్టర్ ట్రాక్టర్లలో మాత్రమే సరఫరా చేయాలి.**

**జిల్లాలోని 6 ఇసుక రీచ్ ల నుంచి ఉచితంగా ఇసుక తీసుకోవచ్చు.**

**ఉదయం 8 నుంచి సాయంత్రం 5 వరకు మాత్రమే ఇసుక తీసుకోవాలి.**

**నిర్దేశిత ధర కంటే అధికంగా ఇసుక విక్రయిస్తే ట్రాక్టర్ సీజ్.**



**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, జనవరి 08 :** సామాన్య ప్రజలు తమ సొంత అవసరాలకు జిల్లాలోని 6 రీచ్ ల నుంచి ఉచితంగా ఇసుక తీసుకొని వెళ్లవచ్చని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.

బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా స్థాయి సాండ్ కమిటి సమావేశం నిర్వహించి నూతన ఇసుక పాలసీ ఆమోదించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంక్రాంతి తరువాత జనవరి 16 నుంచి జిల్లాలో సామాన్య ప్రజలు తమ సొంత అవసరాలకు జిల్లాలోని 6 రీచ్ ల నుంచి ఉచితంగా ఇసుక తీసుకోవచ్చని అన్నారు. పెద్దపల్లి జిల్లా పరిధిలో వినియోగించుకునేందుకు జిల్లా ప్రజలు సుల్తానాబాద్ లోని నీరుకుల్ల, గట్టెపల్లి, ముత్తారం లోని ముత్తారం, అడవి శ్రీ రాంపూర్, మంథని లోని విలోచవరం, అంతర్గాం లోని గోలివాడ ఇసుక రీచ్ లలో ఎక్కడి నుంచైనా ట్రాక్టర్లలో ఇసుక తీసుకోవచ్చని అన్నారు.

ఇసుక రీచ్ ల నుంచి ఉచితంగా తీసుకునే ఇసుక సొంత అవసరాలకు మాత్రమే వాడాలని, ఈ ఇసుకను మన జిల్లా పరిధిలో మాత్రమే వాడాలని, ఎక్కడా ఇసుక డంప్ లు సృష్టించడానికి వీలు లేదని, ఇసుక డంప్ చేసి ఇతర ప్రాంతాలకు తరలించాలని చూస్తే కఠిన చర్య లు తీసుకుంటామని అన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే ఇసుక తరలించాలని, సాయంత్రం 5 తరువాత ఇసుక తరలిస్తే సంబంధిత వాహనాలను సీజ్ చేసి మొదటి సారి 25 వేల జరిమానా, రెండవ సారి డ్రైవింగ్ లైసెన్సు రద్దు చేయడం జరుగుతుందని అన్నారు. ఇసుక తరలింపు కోసం వినియోగించే ట్రాక్టర్ ఓవర్ లోడ్ కావడానికి వీలు లేదని, డ్రైవర్ కు తప్పనిసరిగా లైసెన్సు ఉండాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయడానికి వీలు లేదని , వాహనానికి తప్పనిసరిగా రేడియం స్టిక్కర్లు అన్ని వైపులా అంటించాలని కలెక్టర్ అన్నారు. జిల్లాలోని 6 ఇసుక రీచ్ లకు సంబంధిత తహసిల్దార్లు ప్రత్యేకంగా సిబ్బంది కేటాయించి, ప్రతి రోజు తరలించే ఇసుక వాహన వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని అన్నారు. ప్రతి వారం ఇసుక తరలింపు వివరాలను కలెక్టర్ కు సంబంధిత తహసిల్దార్లు నివేదిక అందించాలని అన్నారు. జిల్లాలోని ఇసుక రీచ్ ల నుంచి తీసుకునే ఇసుక ప్రజలకు జిల్లా యంత్రాంగం నిర్ణయించిన ధర మించకుండా విక్రయించాలని అన్నారు. ట్రాక్టర్ ఇసుక పెద్దపల్లి పట్టణ ప్రాంతంలో 1400, సుల్తానాబాద్ లో 1000, జూలపల్లిలో 1700, ఓదెల లో 1150, శ్రీరాంపూర్ లో 1100, పాలకుర్తి లో 2500, అంతర్గాం లో 1000, రామగుండంలో 2600, మంథని లో 1500, ధర్మారంలో 2300, కమాన్ పూర్ 2200, రామగిరి లో 2200 మాత్రమే విక్రయించాలని అన్నారు. జిల్లాలో ఎక్కడైనా ట్రాక్టర్ ఇసుక నిర్ణీత ధర కంటే అధికాంగా విక్రయిస్తే 08728 223318, 08728 223310 ఫోన్ నెంబర్ల ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోపు ఫిర్యాదు నమోదు చేస్తే సంబంధిత ట్రాక్టర్ల సీజ్ చేయడం జరుగుతుందని, మొదటి సారి 25 వేలు, రెండవ సారి 50 వేల జరిమానా విధించడం జరుగుతుందని అన్నారు.

జిల్లాలో ఎంపిక చేసిన 6 ఇసుక రీచ్ ల నుంచి పెద్దపెల్లి జిల్లా రిజిస్టర్ ట్రాక్టర్లు మాత్రమే ఇసుక తీసుకొని వెళ్లాలని, లారీలు, టిప్పర్లు వంటి పెద్ద వాహనాలు, ఇతర జిల్లాల ట్రాక్టర్లు వినియోగించేందుకు వీలు లేదని అన్నారు.

# గ్రామీణ విద్యార్థులకు చేయూతను అందిస్తా



## సుల్తానాబాద్ జూనియర్ కాలేజ్ అభివృద్ధికి కృషి..

**అగ్ని ధార న్యూస్ సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు 45 రోజులపాటు ఉచిత మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తన సొంత ఖర్చులతో ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంత విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు తన వంతు సహకారం కృషి ఉంటుందని అన్నారు. వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్న సందర్భంగా గ్రామీణ ప్రాంతం నుంచి ఉదయం పూట కాలేజీకి వచ్చే విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం కష్టంగా మారిందని అధికారులు తన దృష్టికి తీసుకువచ్చారని విద్యార్థులు పడుతున్న కష్టాన్ని చూసి ఈకార్యక్రమాన్ని చేపట్టానని వివరించారు. ఈ కాలేజీ పూర్వ విద్యార్థిగా తాను ఈ స్థాయికి ఎదగడం ఎంతో సంతోషంగా ఉందని ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు ఎమ్మెల్యేతెలిపారు. ప్రభుత్వమే ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టాలని సీఎం దృష్టికి తీసుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తానని ఆయన హామీ ఇచ్చారు. సుల్తానాబాద్ కాలేజ్ అభివృద్ధిలో భాగంగా హై స్కూల్ విభాగం కు నూతన భవనాన్ని నిర్మించనున్నట్టు ఆయన అన్నారు. ఎంసెట్, నీట్ పరీక్షలకు సన్నద్ధం అయ్యే స్టూడెంట్స్ కు అవసరమైన పుస్తకాలను అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన, మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ బిరుదు సమత కృష్ణ, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, దన్నాయక్ దామోదర్ రావు,ప్రిన్సిపాల్, లెక్చరర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క పర్యటనను విజయవంతం చేయాలి

## తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** నేడు 9- 01-25 గురువారం ఉదయం 9:00 గ.లకు మన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వనపర్తి జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించాడని వెళ్తున్న సందర్భంగా కడ్తల మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహాని కి పూలమాల వేసి నివాళులర్పించడం జరుగుతుంది. కావున తలకొండపల్లి మండల%శీ% కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతి నిధులు నాయకులు పార్టీ శ్రేణులు కుటుంబ సభ్యులు కార్యకర్తలు అభిమానులు కార్యక్రమంలో పాల్గొనాలి.

# ఆశాదీప్ రెడ్డికి చిత్ర పటం బహుకరించిన అభిమాని ప్రేమ్ కుమార్




**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి):** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికీ చెందిన ప్రేమ్ కుమార్ గత వారం రోజుల క్రితం గ్రామంలో ఉపాధి కోసం బ్యాటరీ దుకాణం ప్రారంభించడం జరిగింది. ఈరోజు దుకాణం సందర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కాయతి ఆశాదీఫ్ రెడ్డి , ప్రేమ్ కుమార్ నీ అభినందించి ,యువత ఉపాధి మార్గం లో నడవడం అర్షించ దగ్గ విషయం అన్నారు. అనంతరం ఆశాదిఫ్ రెడ్డి నీ ఘనంగ సన్మానించి ఆయనకు చిత్ర పటం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, తది తరులు పాల్గొన్నారు.

# గురుకులాలు సద్వినియోగం చేసుకోగలరు



## - గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్

**అగ్నిధార న్యూస్ మంథని :** గురుకులాలను సద్వినియోగం చేసుకోగలరని మంథని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడుతున్న గురుకులాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఉమ్మడి గురుకులాల 5వ తరగతి ప్రవేశ పరీక్షకు అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోగలరని ఆయన కోరారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఎస్సీ ఎస్టీ బీసీ జనరల్ గురుకులాలలో 5వ తరగతి ప్రవేశ పరీక్షకు, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6 నుండి 9 తరగతిలో ఖాళీల కొరకు ప్రవేశానికి, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గౌలిదొడ్డి, అలుగునూరు సిఓఈలో 9వ తరగతి ప్రవేశానికి, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ ఖమ్మం, పరిగి ఎస్ఓఈలో ఎనిమిదో తరగతి ప్రవేశానికి, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజ్ గిరి ఫైన్ ఆర్ట్ స్కూల్ లో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అయన పేర్కొన్నారు. విద్యార్థులు ఫిబ్రవరి 01 లోపు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకోవడానికి విద్యార్థి కులం సర్టిఫికెట్ నెంబర్, ఆదాయం సర్టిఫికెట్ నెంబర్, ఆధార్ కార్డు నెంబర్, బర్త్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్, ఫోటో లతో ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోగలరని ఆయన సూచించారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 23వ తేదీన ఉంటుందని ఆయన గుర్తు చేశారు. గురుకులాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆయన తెలిపారు.

# వైద్యుడిని ఘనంగా సన్మానించిన గ్రామస్తులు



**అగ్నిధార న్యూస్ మంథని :** మంథని మండలం మైదుపల్లి గ్రామ మాజీ గ్రామ సర్పంచ్ తమ్మిశెట్టి కవిత రమేష్, గ్రామస్తులతో కలిసి ఆర్ఎంపి వైద్యుడు మొగిలిని బుధవారం ఘనంగా శాలువాతో సన్మానించి సత్కరించారు. గత 20 సంవత్సరాలుగా గాజులపల్లి గ్రామంలో వైద్య సేవలు అందిస్తూ మన్ననలు పొందుతున్న మొగిలి వైద్య వృత్తిని ప్రారంభించి 20 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా గ్రామస్తులు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పెట్టం రాజేశం, సోమారపు రమేష్, ఈసంపల్లి శ్రీనివాస్, లైశెట్టి శ్రీధర్, రాహుల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పలు పేద కుటుంబాలకు సుందరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం అందజేత:-




**అగ్నిధార న్యూస్ కమన్పూర్ :** స్థానిక కమాన్పూర్ గ్రామపంచాయతిలో గల అంబేద్కర్ కాలనీ మరియు %వీజుూ% ఆఫీస్ పరిధిలోని ఈదునూరి కొమురమ్మ, కుమారుడు సదానందం, వయసు 35సంవత్సరాలు అలాగే కల్వల రాయమల్లమ్మ, వయసు దాదాపు 75 సంవత్సరాలు ఇటీవల అనారోగ్యాలతో మరణించిన విషయం నక్క శంకరి ద్వారా సమాచారం అందుకున్న సుందరం ఫౌండేషన్ ఫౌండర్ బోనాల వెంకటస్వామి తమ సభ్యులను వారి ఇంటికి పంపి ఒక్కొక్కరికి 25కిలోల బియ్యంను సాయంగా అందజేశారు. తమ ఫౌండేషన్ ద్వారా ప్రతీ పేద భాధితుడికి సాయం అందించాలనే లక్ష్యం తోనే మా సంస్థ పనిచేస్తుందని ఈసందర్బంగా వెంకటస్వామి తెలియజేశారు. అలాగే వారి కుటుంబ పరిస్థితి గురించి తెల్సుకుని అన్ని విధాల అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో చిప్పకుర్తి అరవింద్, కన్నూరి నగేష్, చెన్నోజు చంద్రశేఖర్ ఆరెల్లి పీరయ్య, కుక్క ప్రసాద్ మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లెల్ల,యంగంపల్లి గ్రామాల మధ్య రోడ్డు పరిశీలన



## మాజీ సర్పంచ్ జిల్లెల్ల రాములు

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి మండల%శీ% లోనీ జిల్లెల్ల నుండి యంగంపల్లి వరకు రెండు కిలోమీటర్ల బిటి రోడ్డు కు రెండు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణరెడ్డి,ఇరు గ్రామాల మధ్య బిటి రోడ్డు వేసే రోడ్డును మాజీ సర్పంచ్ జిల్లెల్ల రాములు డీఇ లింగం సార్, ఏ ఈ షబ్బీర్ తో కలిసి రెండు గ్రామాల మధ్య గల రోడ్డును పరిశీలించారు. వీరివెంట జిల్లెల్ల యంగంపల్లి గ్రామాల కాంగ్రెస్ నాయకులు వున్నారు.


# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



## చారి ట్రబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి మండలంలోని చంద్రధన గ్రామానికి చెందిన నిధురం కిష్టమ్మ అనారోగ్యంతో మరణించడం జరిగింది. ఈ విషయం స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు ద్వారా తెలుసుకున్న తెలంగాణ రాష్ట్రమాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ తన ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా బాధిత కుటుంబానికి సానుభూతి తెలుపుతూ 3000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ సొల్లు సుధాకర్, మాజీ సర్పంచులు బేగరి రాములు, గంజి శ్రీనివాసులు, కటికేల శేఖర్ యాదవ్, రాఘవాచారి, వనం నరసింహ,నిధురం అశోక్, సొల్లు మల్లయ్య, సొల్లు జగన్, నిధురం యాదయ్య, ఆవుల బాలకిష్టయ్య,సొల్లు పోచయ్య,నిధురం చెన్నయ్య,నిదరం రాఘవేందర్, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి మండలంలోని తర్నికల్ గ్రామం నుండి శ్రీరామ్ నగర్ వరకు బీటీ రోడ్డును మంజూరు చేసినందుకు తర్నికల్ మాజీ సర్పంచ్ చెన్ రెడ్డి పవన్ కుమార్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పవన్ కుమార్ రెడ్డి కృషి వల్ల బీటీ రోడ్డు మంజూరు కావడం జరిగిందని శ్రీరామ్ నగర్ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి , ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువజన కాంగ్రెస్ నాయకులు భాస్కర్ ,తిరుపతయ్య, మురళి ,భిక్షమయ్య తిరుపతి ,రవి ,మల్లేష్ ,సుల్తాన్ ,పరశురాములు, శ్రీను, భీమయ్య ,తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మెఘారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు చెప్పిన నేతలు



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :**వనపర్తి ఎమ్మెల్యే మెఘారెడ్డిని కాంగ్రెస్ నేతలు బుధవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆయన జన్మదినం సందర్భంగా పలువురు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు చెప్పారు.అనంతరం నిర్వహించిన వేడుకలలో ఎమ్మెల్యే మెఘారెడ్డి,శారద దంపతులు కేక్ కట్ చేసి స్వీట్లుపంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిచ్చరెడ్డి, కేబీ నాయుడు, కాంటెస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థి దయానంద్, కాంగ్రెస్ నాయకులు మండ్ల దేవన్ననాయుడు, కాంగ్రెస్ నాయకులు బాలస్వామి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# యువత గ్రామీణ స్థాయి నుంచి జాతీయస్థాయిలో రాణించాలి

## ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి మండల కేంద్రంలో తలకొండపల్లి ప్రీమియర్ లీగ్ క్రికెట్ సీజన్ 3ని తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి తో కలిసి ప్రారంభించిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఎదగాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆటలు ఆడటం వల్ల శారీరకంగా మానసికంగా శారీరకంగా ఆరోగ్య వికాసం పొందుతారని తెలిపారు. అదేవిధంగా యుక్త వయసులో ఉన్నటువంటి యువకులు అభివృద్ధి వైపు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలని దురు వ్యసనాలకు మార కద్ర వ్యాలకు గంజాయి ధూమ పానము మధ్యపానమువంటి వాటికిలోను కాకూడదని క్రీడలలో మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించి గ్రామీణ ప్రాంతాల నుండి జాతీయ అంతర్జాతీయ స్థాయి వరకు తన ప్రతిభను కనపరచాలని ఆయన అన్నారు. క్రికెట్ టోర్నమెంట్ కు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు ఆయిల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర కిసాన్ సెల్ కార్యదర్శి మోహన్ రెడ్డి, శతాబ్ది టౌన్షిప్ చైర్మన్ కాసు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్ మార్కెట్ చైర్మన్ యాట గీతా నరసింహ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, తలకొండపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ డైరెక్టర్ అంజయ్య గుప్తా ,డిసిసి ప్రధాన కార్యదర్శి రవీందర్ యాదవ్, మార్కెట్ డైరెక్టర్ అజీమ్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు భగవాన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డిగ్రీ కృష్ణ తాలూకా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నరేష్, మండల సీనియర్ నాయకులు డేవిడ్, మాజీ ఎంపిటిసి రాములు, మాజీ ఎంపిటిసి పెంటయ్య, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు చెన్నకేశ వులు, తలకొండపల్లి పట్టణ అధ్యక్షులు రమేష్, సీనియర్ నాయకులు రామ్మోహన్ రెడ్డి, అంజయ్య, రమేష్ ,గోపల రమేష్ యాదయ్య, మరియు ఆర్గ నైజర్స్ జూలపల్లి శ్రీను, నరేష్, సందీప్, ఆదర్శ్, గణేష్, ఇతర క్రీడాకారులు పాల్గొనడం జరిగింది.

# చైనా మాంజా అమ్మిన వినియోగించిన కఠిన చర్యలు ఎస్సై నారాయణ



**అగ్నిధారన్యూస్"( సంగారెడ్డి)'** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల్ రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజ అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎస్ నారాయణ బుధవారం మీడియాతో మాట్లాడుతూ హెచ్చరిక చేశారు చైనా మాంజా వినియోగించకూడదు చైనా మాంజ వినియోగం వల్ల పర్యావరణానికి అహాని కలగడంతో పాటు పక్షులు జంతువులు పిల్లలు పెద్దలు ప్రమాదాల బారిన పడుతున్నారు కొన్నేళ్లుగా మార్కెట్లో చైనా మాంజా అమ్మకాలు విపరీతంగా పెరిగాయి అని అన్నారు నైలాన్ దారంతో తయారుచేసే చైనా మాంజాలో గాజు పౌడర్ ను వినియోగిస్తున్నారని అన్నారు ఇది కాటన్ దారంతో తయారు చేసిన మాంజా కన్నా పటిష్టంగా ఉండటంవల్ల ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు చైనా మాంజాతో తలెత్తే అనార్థాల పైన అందరికీ అవగాహన కలిగి ఉండాలన్నారు మనుషులకు హాని కలుగుతుందని జాతీయ హరిత ట్రైబునల్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో చైనా మాంజ వినియోగాన్ని పూర్తిగా నిషేధించడం జరిగిందని అన్నారు దానిని అమ్మిన అక్రమ రవాణా చేసిన మాకు ఫిర్యాదు చేయాలని సూచించారు పర్యావరణ పరిరక్షణ చట్టం1986 ప్రకారం మాంజ అమ్మిన వినియోగించిన%ఎ%-5,15 ప్రకారం శిక్షకు అర్హులవుతారని హెచ్చరించారు సాంప్రదాయ బద్ధంగా తయారు చేసే కాటన్ మాంజను వినియోగించాలని ఎస్సై నారాయణ ప్రజలకు సూచించారు

# కాంగ్రెస్ అంటే కాలయాపనకు కేరాఫ్

## చేసింది శూన్యం మిగిలేది అరణ్యం...

## స్థానిక సంస్థల్లో చావు దెబ్బ ఖాయం

## బీఆర్ఎస్ జిల్లా నేత శ్రీధర్



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేసింది తప్ప రాష్ట్ర ప్రజలకు చేసింది శూన్యమేనని బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్ ఎద్దేవా చేశారు . బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి అలవి కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకుండానే ఎనలేని అప్పులు చేసి రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దివాలా తీయించారని దుయ్యబట్టారు. కేసీఆర్ పదేళ్ళ పాలనలో సంపద సృష్టించి దేశంలోనే తెలంగాణను నెంబర్ వన్ స్థానంలో ఉంచారని గుర్తు చేశారు. రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయలేదని, కుంటి సాకులు చూపుతూ రైతు భరోసాను ఎగ్గొట్టడానికి కుయుక్తులు పన్నుతున్నారని దెప్పి పొడిచారు. మహిళలకు నెలకు రూ. 2,500 పింఛన్లు, కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ లకు అదనంగా ఇస్తానన్న తులం బంగారం ఏమైందో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు .రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెట్టడానికి ఓటర్లు సిద్ధంగా ఉన్నారని వాకిటి శ్రీధర్ హెచ్చరించారు.

# పుష్పాలంకరణలో పాల్గొన్న మాజీ మంత్రి



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** కొండూరు.నరేష్,రామ్ కుమార్ ఆహ్వానం మేరకు కలకొండ సునీత రామ్ మోహన్ కూతురు శ్రావణిపుష్పాలంకరణ వేడుక తరుణ్ణి ఫంక్షన్ హాల్ నందు జరిగింది.ఇట్టి వేడుకకు హాజరైన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శ్రావణి నీ ఆశీర్వదించారు. నిరంజన్ రెడ్డివెంట వాకిటిశ్రీధర్,నందిమల్లఅశోక్,మంద.రాము, ముద్దు సార్ ఉన్నారు.

# శివనారాయణతోపాటు ఇటీవల మరణించిన కుటుంబాలకుమాజీ మంత్రి నివాళులు



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:** బి.ఆర్.ఎస్ నాయకులు డాక్టర్.శివనారాయణ నిన్న జరిగిన రోడ్ ప్రమాదంలో మరణించారు.విషయం తెలిసిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కిష్టగిరి గ్రామములో వారి స్వగృహంలో శివనారాయణ పార్థీవదేహానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించినారు.నిరంజన్ రెడ్డివెంట జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్,నందిమల్ల.అశోక్, మాణిక్యం,ధర్మానాయక్,చిట్యాల.రాము బి.ఆర్.ఎస్ నాయకులు ఉన్నారుపెద్దమందడి మండలం బలిజేపల్లి,జంగమాయపల్లి,పామ్ రెడ్డిపల్లి గ్రామాలలోనిరంజన్ రెడ్డిఇటీవల మరణించిన కుటుంబాలను పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చి ఆర్థిక సహాయం అందజేసారు.ఇందులో పాను గంటి.పెంటయ్య,వడ్డే. బాల్ చంద్రయ్య ,రాములు, పాతిమాబేగం,చిట్టెమ్మ,రాములు కుటుంబాలను పరామర్శించి ధైర్యం గా ఉండాలని అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రఘుపతి రెడ్డి, మాజీ సర్పంచ్ జయంతి మేడం,శేషివర్ధన్ రెడ్డి, నందిమల్ల.అశోక్, రఘువర్ధన్ రెడ్డి, గోవర్ధన్, సురేష్,సత్యం, నరేష్,కార్తీక్,గ్రామ నాయకులు తదితరులు ఉన్నారు.

# రాష్ట్ర బిజెపి కార్యాలయం పై దాడికి నిరసనగా వనపర్తి లో సీఎం దిష్టిబొమ్మ దగ్ధం



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** హైదరాబాదులో రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యాలయం పై కాంగ్రెస్ కార్యకర్తలదాడికి నిరసనగా బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలో భారతీయ జనతా యువమోర్చా అధ్యక్షులు ఏ రాజశేఖర్ఆధ్వర్యంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు డి నారాయణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికి నిరసన తెలిపే హక్కు ఉంటుందని కానీ తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా కాంగ్రెస్ కార్యకర్తలు బిజెపి ప్రధాన కార్యాలయం పై కర్రలతో, రాళ్లతో దాడి చేశారని అన్నారు. నిరసన తెలుపడం ప్రజాస్వామ్యలో సహజం కానీ ఈ విధంగా దాడి చేయడం సమంజసం కాదన్నారు. మేము తిరిగి దాడి చేస్తే ఎవరు కాంగ్రెస్ కార్యకర్తలు దాక్కోవడానికి స్థలం కూడా దొరకదని అన్నారు. మీరు రెండు మూడు రాష్ట్రాలలో అధికారంలో ఉన్నారని, మేము 19 రాష్ట్రాలకు పైగా అధికారంలో ఉన్నామని మేముతలుచుకుంటే మీరు ఎక్కడ తిరగరని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోక్నాథ్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు బచ్చు రాము,అధికార ప్రతినిధి శ్రీశైలం, రామన్ గౌడ్, చిత్తారి ప్రభాకర్, బండారు కుమారస్వామి సీతారాములు, బీజేవైఎం అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, ఎద్దుల రాజు, రాయన్న సాగర్, కృష్ణ గౌడ్, తిరుమలేశ్, సాయి నరేష్, శివ, శ్రీకాంత్, వెంకటేష్ నాయక్, గోపీనాథ్,బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితునికి జీవిత కారాగార జైలు శిక్ష

## జిల్లాలో నేరాలకు పాల్పడిన వారికీ శిక్షలు తప్పవు

## ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దు ఎస్పీ రావుల గిరిధర్

**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా** :హత్యానేరం ఋజువైనందున నేరస్తునికి జీవిత కారగార జైలు శిక్షతో పాటు7,000/- రూ. జరిమానా విధించిన వనపర్తి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి ఎం ఆర్, సునీత బుధవారం తీర్పు ఇచ్చారని ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు.కేసు యొక్క వివరాలనుపరిశీలిస్తేఆత్మకూరు పోలీస్టేషన్ పరిధిలోని బాలకిష్టపూర్ తాండకు చెందిన మూడవత్ మణెమ్మ ను భర్త గోపాల్ నాయక్ పెట్రోల్ పోసి తగులబెట్టి చంపినందున కొడుకు కృష్ణ ఫిర్యాదు పై తేది:05-11-2020 అప్పటి ఆత్మకూరు ఎస్సై, ముత్తయ్య %ఎతీ.అఠీ 106/2020 ఖ/౦



302, 498 (ఊ) ఖూజ% నందు కేసు నమోదు చేయగా తేదీ 20.122020 రోజు మృతురాలు మరణించగా అప్పటి సీఐ సీతయ్య ఇన్వెస్టిగేషన్ ప్రారంభించారు. మృతురాలు ఇచ్చిన మరణ వాంగ్మూలంపై విచారణ జరిపి భార్యను వేధింపులకు గురిచేసి పెట్రోల్ పోసి చంపిన నిందితుడు మూడవత్ గోపాల్ పై అప్పటి సీఐ సీతయ్య ఛార్జ్ షీట్ ఫైల్ చేశారు. ప్రస్తుత సీఐ, శివకుమార్ , ఎస్సై, నరేందర్ ఆదేశాల మేరకు కోర్టు లైజనింగ్ అధికారి హెడ్ కానిస్టేబుల్, సత్యం, కోర్టు డ్యూటీ ఆఫీసర్లు రాజేందర్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్రాసిక్యూటర్ శ్రీ బి. గోపాల్ రెడ్డి కోర్టులో వాదనలు వినిపించగా నేరస్తునిపై నేరం నిరూపణ అయినందున బుధవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం ఆర్ సునీత తీర్పు ఇచ్చారని ఎస్పీ శ్రీ రావుల గిరిధర్ తెలిపారు.

ఈ కేసులో నేరస్తునికి శిక్ష పడడంలో బాగా పనిచేసిన పోలీస్ అధికారులను, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ను, కోర్టు డ్యూటీ ఆఫీసర్లను ఎస్పీ అభినందించి త్వరలో రివార్డు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ కూడా శిక్ష నుండి తప్పించుకొలేరని, ప్రజలు ఎవరు కూడా చట్టాన్ని తమ చేతిలోకి తీసుకోవద్దని ఎస్పీ తెలిపారు.పోలిసులు ,ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ , న్యాయ నిరూపణ జరిపి కచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారని సూచించారు.

# ఉనికి కోసం బీఆర్ఎస్ ఆరాటం





## గ్రామీణ రోడ్లకు మహార్దశ..

## అభివృద్ధితో పాటు రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత..

## ఉనికి కోసం బీఆర్ఎస్ లీడర్ల డ్రామాలు..

## ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు.

**అగ్నిధారన్యూస్** జూలపల్లి పెద్దపల్లి నియోజకవర్గంలోని గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్టు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పేర్కొన్నారు.జూలపల్లి మండలం కాచాపూర్ నుండి వడ్కాపూర్, జూలపల్లి వరకు రూ.19.80 కోట్లతో నిర్మాణం తలపెట్టిన రోడ్డు పనులకు బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన, భూమి పూజ చేశారు. అనంతరం జూలపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో 20 లక్షల రూపాయలతో నూతన ఆరోగ్య కేంద్రానికి అలాగే వడ్కాపూర్ గ్రామంలో పద్మశాలి భవనానికి 5 లక్షల రూపాయల నిధులతో స్థానిక నాయకులతో కలిసి పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు శంఖుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..జూలపల్లి మండలంలో ఉన్న గ్రామీణ రోడ్లకు పెద్ద ఎత్తున నిధులను సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే రూ.12 కోట్లతో కాచాపూర్, నిట్టూరు రోడ్డు పనులు చేపట్టినట్టు తెలిపారు. జూలపల్లి వద్ద గల వాగు పై నూతన వంతెనకు 5 కోట్ల రూపాయల నిధులతో టెండర్ కు ఆహ్వానించడం జరిగిందని రాబోయే సంవత్సర కాలంలో వివిధ రోడ్లను అభివృద్ధి చేస్తానన్నారు. అభివృద్ధి పనులతో పాటు రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. గత పది సంవత్సరాల కాలంలో రైతులను, ప్రజలను మభ్యపెట్టి అధికారం వెలగబెట్టిన బీఆర్ఎస్ లీడర్లు ఇటీవల కాలంలో ఉనికి కోసం పడుతున్న పాట్లు చూస్తే జాలేస్తోందని ఆయన అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉనికి చాటుకోవడానికి రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేయడం, పొలాల్లో నాట్లు వేయడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని గౌరవ ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్, కటింగులు లేకుండా ధాన్యం కొనుగోలు చేసినందుకా, రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు చొప్పున చెల్లించనున్నందుకా బీఆర్ఎస్ నాయకులు ధర్నాలు చేస్తున్నారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఏనాడు రైతుల సంక్షేమాన్ని పట్టించుకోని పాపాన పోలేదని బిఆర్ఎస్ లీడర్లపై ఎమ్మెల్యే విరుచుకుపడ్డారు. గత పాలకులు కేవలం తమ స్వప్రయోజనాల కోసమే అధికారాన్ని వాడుకున్నారని ధ్వజమెత్తారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా.. ప్రభుత్వంపై ఎన్ని దుష్ప్రచారాలు చేసినా నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజల కోసం.. వారి సంక్షేమం కోసం.. గ్రామాల అభివృద్ధి కోసం.. తాను, తమ కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జూలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గండు సంజీవ్, సింగల్ విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్ రావు, మండల అధ్యక్షులు బొజ్జ శ్రీనివాస్, దారవెన నరసింగ్ యాదవ్, కొమ్ము పోచాలు, దుగ్యాల శ్యామ్ రావు, కందుకూరి అంజయ్య, బండి స్వామి, కోరుకంటి సంపత్, నర్సింగ్, దుగ్యాల శ్యామ్ ప్రసాద్ రావు, మహంకాళి అంజయ్య, మల్లెత్తుల కొమురయ్య, కల్లెపల్లి అంజి, లింగయ్య యాదవ్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు చేయూతను అందిస్తా




## సుల్తానాబాద్ జూనియర్ కాలేజ్ అభివృద్ధికి కృషి..

## ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు..

**అగ్నిధారన్యూస్ సుల్తానాబాద్** : ుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు 45 రోజులపాటు ఉచిత మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తన సొంత ఖర్చులతో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని కాలేజీలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులతో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంత విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు తన వంతు సహకారం కృషి ఉంటుందని అన్నారు. వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్న సందర్భంగా గ్రామీణ ప్రాంతం నుంచి ఉదయం పూట కాలేజీకి వచ్చే విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం కష్టంగా మారిందని అధికారులు తన దృష్టికి తీసుకువచ్చారని, ఇందుకు తాను ఇట్టి కార్యక్రమాన్ని చేపట్టానని వివరించారు. ఈ కాలేజీ పూర్వ విద్యార్థిగా తాను ఈ స్థాయికి ఎదగడం ఎంతో సంతోషంగా ఉందని, ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం తన బాధ్యతగా భావిస్తున్నట్టు విజయరమణ రావు తెలిపారు. ప్రభుత్వమే ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తా అన్నారు. సుల్తానాబాద్ కాలేజ్ అభివృద్ధిలో భాగంగా హై స్కూల్ విభాగం కు నూతన భవనాన్ని నిర్మించనున్నట్టు చెప్పారు. ఎంసెట్, నీట్ పరీక్షలకు సన్నద్ధం అయ్యే స్టూడెంట్స్ కు అవసరమైన పుస్తకాలను అందిస్తానని చెప్పారు. కాలేజీ విద్యార్థులు చదువులతో పాటు క్రీడలు ఇతర అన్ని రంగాల్లో రాణించడం గర్వంగా ఉందన్నారు. పట్టుదలతో లక్ష్యాన్ని సాధించేందుకు స్టూడెంట్స్ కష్టపడి చదవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన, మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు, ఏఎంసి చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ బిరుదు సమత కృష్ణ, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, ప్రిన్సిపాల్, లెక్చరర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణికి స్పెషల్ క్యాంపెన్ 4.౦ పురస్కారం




**అగ్ని ధార న్యూస్. మందమర్రి జనవరి 8. :** కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి చేతుల మీదుగా..స్వీకరించిన సీఎండీ ఎన్.బలరామ్సింగరేణి భవన్, జనవరి 8,2025

పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ ఎక్కువ సంఖ్యలో, ప్రదేశాలను పరిశుభ్రం చేసినందుకు సింగరేణి కాలరీస్ కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది.కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్పెషల్ క్యాంపెన్ 4.%ూ% లో.. ఎక్కువ ప్రాంతాలను పరిశుభ్ర పరిచిన (మ్యాగ్జిమమ్ నెంబర్ ఆఫ్ సైట్స్ క్లీన్డ్ ) విభాగంలో అవార్డు వరించింది. ఢిల్లీలో బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో.. నిర్వహించిన చింతన్ శివిర్ లో భాగంగా మంగళవారం రాత్రి కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి, జి.కిషన్ రెడ్డి చేతుల మీదుగా..సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ఈ అవార్డును స్వీకరించారు.

కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని కోలిండియా, అనుబంధ సంస్థలు,నైవేలీ లిగ్నైట్ సంస్థల్లో గత ఏడాది అక్టోబరు 2వ తేదీ నుంచి, అక్టోబరు 31వ తేదీ వరకు, స్పెషల్ క్యాంపెన్ 4.0 పేరిట స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ఇందులో సింగరేణి వ్యాప్తంగా..11 ఏరియాల్లో 157 చోట్ల పరిసరాలను పరిశుభ్రం చేయడాన్ని స్వీయ లక్ష్యంగా నిర్దేశించుకోవడం జరిగింది.అయితే 216 ప్రదేశాల్లో పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టడం విశేషం. ఈ నేపథ్యంలో ఎక్కువ సంఖ్యలో ప్రదేశాలను శుభ్ర పరచిన విభాగంలో ఈ పురస్కారం లభించింది. సింగరేణి చేపట్టిన పరిశుభ్రత కార్యక్రమానికి గుర్తింపు లభించడంపై సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ...దేశ ఇంధన అవసరాలకు బొగ్గు ఎంత అవసరమో,ఆరోగ్య భారతావనికి పరిశుభ్రత అంతే అవసరమన్నారు. సింగరేణి పరిశుభ్రతకు పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బొగ్గు శాఖ కార్యదర్శి,విక్రమ్ దేవ్ దత్,బొగ్గు శాఖ అదనపు కార్యదర్శులు శ్రీమతి రూపేందర్ బ్రార్,శ్రీమతి విస్మితా తేజ్,సింగరేణి జీఎం బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ స్టేట్ అథ్లెటిక్ పోటీలలో.. మందమర్రి ఏరియాకి గోల్డ్ మెడల్



**అగ్ని ధార న్యూస్. మందమర్రి జనవరి 8.:** హైదరాబాద్ గచ్చిబౌలిలో జరిగిన, 11 తెలంగాణ స్టేట్ లెవెల్ అథ్లెటిక్ అన్ పోటీలలో మందమర్రి ఏరియా కు చెందిన పి.సమ్మయ్య, ఏ ఎస్ ఓ సర్వే చైర్మన్ గా పనిచేస్తూ.. క్రీడ పట్ల ఆసక్తితో గచ్చిబౌలిలో జరిగిన అథ్లెటిక్ పోటీలలో పాల్గొని 5కే రన్ లో గోల్డ్,1500 మీటర్స్ రన్ లో సిల్వర్,800 మీటర్స్ రన్ లో బ్రాంజ్ మెడల్స్ ను సాధించారు వీరిని మందమరి ఏరియా జనరల్ మేనేజర్ జి .దేవేందర్ గారు జిఎం.కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఏరియా సర్వే ఆఫీసర్ ఉజ్వల్ బందోపాధ్యాయ, ప్రసాద్,నరేష్ మరియు సర్వ సిబ్బంది పాల్గొన్నారు.

# సైబర్ క్రైమ్ పైఅవగాహన

**అగ్నిధార న్యూస్. మందమర్రి జనవరి 8.**కొద్ది నెలలుగా నమోదవుతున్న సైబర్ నేరాలను పరిశీలిస్తే బాధితుల్లో ఎక్కువగా డిజిటల్ అరెస్టు బాధితులు వుంటున్నారు.దాంతో విద్యార్థులను చైతన్యపరచాలని ఉద్దేశ్యం తో సైబర్ జాగృత దివాస్ కార్యక్రమం లో భాగంగా.. డిజి. షికా గోయల్ ఆదేశాల మేరకు, సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటరమణ ఆధ్వర్యంలో.. బుధవారం రోజున,మంచిర్యాల్ జిల్లా, మందమర్రి సింగరేణి మహిళా జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో డిజిటల్ అరెస్టు సైబర్ నేరాలపై అవగాహనా కల్పించాలని ఉద్దేశంతో.. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.సైబర్ క్రైమ్ డి.ఎస్.పి ఎమ్. వెంకటరమణ మాట్లాడుతూ.... ముఖ్య%శీ%గా ప్రస్తుత కాలంలో ఎక్కువగా ప్రజలు మోసపోయి చాలా డబ్బులు పోగొట్టుకున్న డిజిటల్ అరెస్టు కు సంబంధించిన సైబర్ క్రైమ్ ఎలా జరుగుతుంది, ప్రజలు ఎలా మోసపోతున్నారు, అనే దాని గురించి వారికి వివరించారు.అసలు డిజిటల్ అరెస్టు పోలీసు చేయరు అని వివరించి ఒకవేళ అలాంటి డిజిటల్ అరెస్టు కాల్స్ వస్తే వాటికి ఎలా స్పందించాలి,ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాలు వారికి వివరించడం జరిగింది. అంతే కాకుండా సైబర్ క్రైమ్ డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. సైబర్ క్రైమ్. గౌట్,ఇన్.సైబర్ ట్రోల్ ఫ్రీ నెంబర్ 1930 ఇంపార్టెంట్స్ పై గురించి తెలిపారు. ఆన్లైన్ మోసాలపై అడ్డుకట్ట వేయుటకు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ప్రస్తుత సమాజంలో సెల్ ఫోన్ వలన ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో,అన్ని అనర్థాలు కూడా జరుగుతున్నాయని, సెల్ ఫోన్ వినియోగం పట్ల ఎల్లప్పుడూ..అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఆండ్రాయిడ్ ఫోన్ ఉపయోగం పెరగడం తో సైబర్ మోసాలు పెరుగుతున్నాయని మోసగాళ్ల ఉచ్చులో పడి నష్టపోకుండా ఉండాలని, తమ ఇంటికి వెళ్ళాక తల్లిదండ్రులకు, బంధువులకు,చుట్టూ ప్రక్కల వారికి,మీ గ్రామంలలో కూడా సైబర్ నేరాల గురించి తెలుసుకున్నది వివరించి వారిని కూడా అప్రమత్తం చేయాలి అని చెప్పారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వెంటనే సైబర్ నేరాల గురించి 1930 అనే టోల్ ఫ్రీ నెంబర్ లేదా హెచ్ టి టి పి ఎస్:// సైబర్ క్రైమ్.జీ.ఓ.వీ.ఐ.ఎన్/ ద్వారా ఫిర్యాదు చేయాలని వారికి కి సూచించారు.



## ఆ సన్నివేశాలు తొలగించండి..

### కోర్టును ఆశ్రయించిన నటి రమ్య

అభిమన్యు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది కన్నడ భామ రమ్య ఈ మాజీ మైసూరు ఎంపీ తాజాగా కోర్టును ఆశ్రయించింది. 2023లో రిలీజైన కన్నడ కామెడీ డ్రామా  రమ్య కామియో రోల్‌లో మెరిసింది. అయితే తన అనుమతి లేకుండా ఈ సినిమాలో ఉపయోగించిన సీన్లను తొలగించాలని నిర్మాతలను కోరుతూ బెంగళూరులోని కమర్షియల్ కోర్టు కాంప్లెక్స్‌ను ఆశ్రయించింది. ట్రైలర్‌తోపాటు సినిమాలోని ఫుటేజీలో కొన్ని సన్నివేశాలను తన ప్రమేయం లేకుండా వాడారని రమ్య ఫిర్యాదులో పేర్కొన్నది. నిర్మాతలు అనుమతి లేకుండా వాడిన తన వీడియోలను తొలగించడమే కాకుండా.. తనకు కోటి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ విషయమై నిర్మాతలకు పలుమార్లు విజ్ఞప్తి చేసిన తన సీన్లు తొలగించడం, ఎలాంటి యాక్షన్ తీసుకోవడం కానీ చేయలేదని రమ్య  ఆరోపించింది. సినిమాలోని తన సన్నివేశాలను తొలగిస్తే కేసును వెనక్కి తీసుకుంటానని కూడా రమ్య చెప్పినట్టు ఇండస్ట్రీ సర్కిల్ టాక్.



# ఆ సన్నివేశాలు తొలగించండి


## కోర్టును ఆశ్రయించిన నటి రమ్య

అభిమన్యు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది కన్నడ భామ రమ్య ఈ మాజీ మైసూరు ఎంపీ తాజాగా కోర్టును ఆశ్రయించింది. 2023లో రిలీజైన కన్నడ కామెడీ డ్రామా  రమ్య కామియో రోల్‌లో మెరిసింది. అయితే తన అనుమతి లేకుండా ఈ సినిమాలో ఉపయోగించిన సీన్లను తొలగించాలని నిర్మాతలను కోరుతూ బెంగళూరులోని కమర్షియల్ కోర్టు కాంప్లెక్స్‌ను ఆశ్రయించింది. ట్రైలర్‌తోపాటు సినిమాలోని ఫుటేజీలో కొన్ని సన్నివేశాలను తన ప్రమేయం లేకుండా వాడారని రమ్య ఫిర్యాదులో పేర్కొన్నది. నిర్మాతలు అనుమతి లేకుండా వాడిన తన వీడియోలను తొలగించడమే కాకుండా.. తనకు కోటి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ విషయమై నిర్మాతలకు పలుమార్లు విజ్ఞప్తి చేసిన తన సీన్లు తొలగించడం, ఎలాంటి యాక్షన్ తీసుకోవడం కానీ చేయలేదని రమ్య ఆరోపించింది. సినిమాలోని తన సన్నివేశాలను తొలగిస్తే కేసును వెనక్కి తీసుకుంటానని కూడా రమ్య చెప్పినట్టు ఇండస్ట్రీ సర్కిల్ టాక్. మరి రమ్య వ్యవహారంపై నిర్మాతలు ఎలా స్పందిస్తారనేది తెలియాల్సి ఉంది.



# శర్వానంద్ కోసం నందమూరి, కొణిదెల హీరోలు

హిట్టు ఫ్లాప్‌లు సంబంధం లేకుండా సినిమాలు చేసుకుంటూ వెళుతున్నాడు టాలీవుడ్ నటుడు శర్వానంద్. గతేడాది మనమే అంటూ వచ్చి విజయాన్ని అందుకున్నాడు. అయితే ఈ నటుడు ప్రధాన పాత్రలో వస్తున్న తాజా ప్రాజెక్ట్ శర్వా 37. 'సామజవరగమన' దర్శకుడు రామ్ అబ్బరాజు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్లు నటిస్తున్నారు. వారిలో ఒకరు సంయుక్త కాగా మరొకరు యంగ్ బ్యూటీ సాక్షి వైద్య. ఇప్పటికే ఈ సినిమా నుంచి శర్వానంద్ తో పాటు సాక్షి వైద్య ఫస్ట్ లుక్స్ రిలీజ్ అయ్యాయి. తాజాగా ఈ మూవీ నుంచి టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్‌ని విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ టైటిల్ లాంచ్ కోసం నందమూరి హీరోతో పాటు కొణిదెల హీరో ముఖ్య అతిథులుగా రానున్నట్లు చిత్రబృందం తెలిపింది. అయితే వారెవరు అనేది తెలియాలంటే జనవరి 14 వరకు వెయిట్ చేయాల్సిందే. ఈ మూవీకి 'నారీ నారీ నడుమ మురారి' అనే టైటిల్ ఫిక్స్ అయినట్లు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. గతంలో ఇదే పేరుతో బాలయ్య ఓ సినిమా చేశారు. ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్, అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర ఈ సినిమాను నిర్మిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు.



# బెల్లంకొండ శ్రీనివాస్ సాహస గాథ

టాలీవుడ్ యాక్టర్ బెల్లంకొండ సాయి శ్రీనివాస్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. ఈ యంగ్ యాక్టర్ నటిస్తోన్న ప్రాజెక్టుల్లో ఒకటి %దీూూ%12. లుధీర్ బైరెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ మిస్టిక్ థ్రిల్లర్‌గా వస్తుంది. ఇటీవలే బెల్లంకొండ కొండపైన అటవీ ప్రాంతంలో గాలులు, మంటల మధ్య రైడ్ చేయడానికి సిద్ధంగా ఉన్న లుక్ ఒకటి విడుదల చేయగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తాజాగా టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోనువ విడుదల చేశారు. కొండలు, అటవీ ప్రాంతం విజువల్స్‌తో మొదలైంది ట్రైలర్. ఓ వైపు ఆలయంపై ఇంధనం చల్లుతున్న సన్నివేశాలు, గర్జిస్తున్న సింహం.. మరోవైపు బెల్లంకొండ బైక్‌పై వాటిని నియంత్రించేందుకు వస్తున్న విజువల్స్‌తో గూస్‌బంప్స్ తెప్పించేలా సాగుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. దైవత్వంలో పాతుకుపోయిన, సాహసంతో కూడిన కథ అంటూ విడుదల చేసిన వీడియో నెట్టింటిని షేక్ చేస్తోంది. ఈ చిత్రానికి లియోన్ జేమ్స్ సంగీతం, బ్యాక్ గ్రౌండ్ మెయిన్ హైలెట్‌గా నిలువబోతున్నట్టు విజువల్స్ చెప్పకనే చెబుతున్నాయి. ఈ మూవీలో భీమ్లానాయక్ ఫేం సంయుక్తా మీనన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా..ఇప్పటికే లాంచ్ చేసిన సంయుక్తా మీనన్ స్టైలిష్, ట్రెండీ లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. సంయుక్తా మీనన్ ఇందులో సమీర పాత్రలో నటిస్తోంది. ఈ మూవీకి దాశరథి శివేంద్ర సినిమాటోగ్రఫర్‌గా పనిచేస్తున్నాడు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed  at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli  Pin co.505172  State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com